మంగళవారం
15-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 143
పేజీలు : 8, వెల:రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్లొవేనియా అధ్యక్ష ఎన్నికల్లో మహిళకు పట్టం

స్లొవేనియా అధ్యక్ష పీఠాన్ని మొట్టమొదటిసారి ఓ మహిళ కైవసం చేసుకున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన న్యాయవాది నటాసా పిర్క్ ముసార్ ఆదివారం అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.

2లో

రేషన్ ఝులక్

- కేంద్రం పరిశీలనలో 10 లక్షలపైగా కార్డుల రద్దు
- జిల్లా కేంద్రాలకు జాబితాలు
- తప్పుడు సమాచారం సాకు

న్యూఢిల్లీ: పేద, మధ్యతరగతి ప్రజలకు షాక్‌లమీద షాక్‌లిస్తున్న కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం తాజాగా రేషన్ కార్డుదారులకు ఝులక్ ఇచ్చేందుకు సిద్ధమౌతోంది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారులకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ, పేద, మధ్యతరగతి ప్రజలకు మొండిచేయి చూపుతోంది. ఒకపక్క పేదలను ఉద్ధరిస్తున్నట్టు ప్రకటనలు గుప్పిస్తూ మరో పక్క వారి కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలలో కోత విధిస్తూ, నిలిపివేస్తూ నానా అగచాట్లకు గురిచేస్తోంది. తాజాగా పది లక్షలకుపైగా రేషన్‌కార్డులను రద్దుచేసేందుకు చర్యలు ప్రారంభించింది. తప్పుడు సమాచారంతో రేషన్ కార్డులు పొందారన్న నెపంతో కేంద్రం రేషన్‌కార్డుదారులకు షాక్ ఇవ్వనుంది. ప్రస్తుతం అమలులో ఉన్న రేషన్‌కార్డులలో చాలా వరకు కోతవేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం 10 లక్షల రేషన్ కార్డులను ప్రభుత్వం రద్దు చేయబోతోంది. ఈ సంఖ్య ఇంకా పెంచే విషయమై సమీక్ష ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. రాబోయే రోజుల్లో రద్దు అయ్యే రేషన్‌కార్డుల సంఖ్య పెరిగే అవకాశం ఉండవచ్చని సమాచారం. ఇప్పటివరకు ప్రభుత్వం 10 లక్షల మంది లబ్ధిదారులను అనర్హులగా గుర్తించింది. ఈ జాబితాను స్థానిక రేషన్ డీలర్లకు పంపనుంది. ఈ నకిలీ లబ్ధిదారుల పేర్ల జాబితాను తయారు చేసి, అలాంటి కార్డుదారుల నివేదికను జిల్లా కేంద్రానికి పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ సమాచారాన్ని పరిశీలించిన తర్వాత అటువంటి లబ్ధిదారుల రేషన్ కార్డులను రద్దు చేయాలని సంబంధిత శాఖను ఆదేశించనుంది. ఎన్‌ఎఫ్ ఎస్ఏ ప్రకారం వీరు రేషన్ పొందేందుకు అనర్హులుగా ప్రకటించింది. ఆదాయపు పన్ను చెల్లించే వారు, ఆరు ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉన్న వ్యక్తుల కార్డులను రద్దు చేయనుంది. వీటితో పాటు రేషన్‌ను ఉచితంగా విక్రయిస్తూ కొందరు అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దీంతో ఈ

- మిగతా 2 లో

రాష్ట్ర విభజన, అమరావతి రాజధాని కేసులు

విడివిడిగా విచారణ

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- తదుపరి విచారణ 28కి వాయిదా



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర విభజన, అమరావతి రాజధాని కేసులను విడివిడిగానే విచారిస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ రెండు కేసులను వేర్వేరుగా విచారించాలని ప్రభుత్వం తరఫున కోరామని, ఆ మేరకు సుప్రీం కోర్టు అంగీకరించిందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ, మాజీ ఏజీ వేణుగోపాల్ తెలిపారు. రాష్ట్ర విభజన పిటీషన్లపై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 28కి వాయిదా వేసింది. అమరావతిపై 8, రాష్ట్ర విభజనపై 28 పిటీషన్లు దాఖలయ్యాయి. హైకోర్టులో అమరావతి రైతులు వేసిన కోర్టు ధిక్కరణ పిటీషన్లను కేకే వేణుగోపాల్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి మూడు రాజధానులు పెట్టే అధికారం లేదని, అమరావతే రాజధాని అని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ తీర్పుపై జగన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ దాఖలు చేసింది. అదే సమయంలో అమరావతి ప్రాంత రైతులు కూడా తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ పిటీషన్లు దాఖలు చేశారు. వాటన్నింటినీ సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ రెండు వాదనలపై ఇప్పటివరకు మొత్తం 36 పిటీషన్లు దాఖలయ్యాయి. రైతులు, ఇతర సంఘాల తరఫున దాఖలైన పిటీషన్లన్నింటినీ ఒకటిగా చేర్చి విచారణ చేపట్టాలని గతంలో సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్ణయించగా, తాజాగా దానిని పునఃసమీక్షించినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే విడివిడిగా విచారణ చేపట్టాలనే నిర్ణయానికి వచ్చి సోమవారం జరగాల్సిన విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసినట్లు న్యాయవాదులు చెబుతున్నారు. దీనితో పాటు ఈ ఒక్కరోజే 30కి పైగా పెండింగ్ కేసులను సుప్రీంకోర్టు విచారించడం, నిర్దేశిత సమయానికి అమరావతి పిటీషన్లకు కేటాయించిన నంబర్ రాకపోవడం వల్ల విచారణ వాయిదా పడినట్లు చెపుతున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శివరామకృష్ణన్ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదిక, దీని తరువాత వైసీపీ ప్రభుత్వం వేసిన జీఎన్ రావు, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, అత్యున్నతస్థాయి కమిటీ రూపొందించిన నివేదికల్లోని అంశాలను హైకోర్టు పట్టించుకోలేదని జగన్ ప్రభుత్వం వాదిస్తోంది. రాజధాని నగరాలను నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్.. వేర్వేరు సందర్భాల్లో లోక్‌సభ, రాజ్యసభల్లో చేసిన ప్రకటనలను దీనికి జోడించి సుప్రీంకోర్టుకు సమర్పించింది. రాజధానిని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్న హైకోర్టు తీర్పును ప్రభుత్వ న్యాయవాది వైద్యనాథన్ చదివి వినిపించారు. అధికార వికేంద్రీకరణ జరగాలంటూ వివిధ సంఘాలు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశాల సారాంశాన్ని క్లుప్తంగా సుప్రీంకోర్టుకు వివరించి, హైకోర్టు తీర్పుపై స్టే విధించాలని కోరనున్నట్లు న్యాయవాది వైద్యనాథన్ వెల్లడించారు.

ట్విట్టర్‌లో మరో 4400 మంది తొలగింపు

ఖర్చులను తగ్గించుకునే క్రమంలో ట్విట్టర్ కొత్త యజమాని ఎలాన్ మస్క్ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. తాజాగా ఔట్‌సోర్సింగ్ విభాగంలో పెద్ద ఎత్తున లేఆఫ్‌లు ప్రకటించినట్లు తెలుస్తోంది.

8 లో

కొత్త సీఎస్ శ్రీలక్ష్మి?

- సీబీఐ కేసుల కొట్టివేతతో మార్గం సుగమం
- రేసులో నీరబ్, జవహర్, పూనం మాలకొండయ్య
- నెలాఖరుకు సమీర్ శర్మ పదవీకాలం పూర్తి
- సీఎం జగన్ నిర్ణయంపై ఐఏఎస్‌ల్లో చర్చ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ పదవీకాలం నెలాఖరుతో ముగియనుంది. దీంతో డిసెంబరు 1వ తేదీ నుంచి కొత్త సీఎస్‌గా ఎవరు రాబోతున్నారనే దానిపై అధికారుల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ముఖ్యంగా ఐఏఎస్‌ల్లో కొత్త సీఎస్ ఎవరనేదానిపై విశ్లేషణలు జోరందుకున్నాయి. ఆశావహుల్లో 1988 బ్యాచ్‌కి చెందిన ఎర్రా శ్రీలక్ష్మి, పూనం మాలకొండయ్య, జవహర్‌రెడ్డి పేర్లు ప్రముఖంగా వినపడుతున్నాయి. వీరిలో శ్రీలక్ష్మికే అవకాశాలు మెండుగా ఉన్నాయని అధికారపార్టీ నేతలతో పాటు ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై నమోదైన అక్రమాస్తుల కేసులో శ్రీలక్ష్మి నిందితురాలిగా ఉన్నారు. ఆమె జగన్‌తో పాటు చంచల్‌గూడ జైలులో కొంత కాలం ఉన్నారు. దీంతో శ్రీలక్ష్మిపై ముఖ్యమంత్రికి ప్రత్యేక సానుభూతి ఉందని చెపుతున్నారు. అందుకే తెలంగాణ కేడర్‌కు చెందిన శ్రీలక్ష్మిని సీఎం జగన్ పట్టుబట్టి ఏపీకి తీసుకొచ్చారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంపైనా సీఎం గట్టి ఒత్తిడే తీసుకొచ్చారు. శ్రీలక్ష్మి ఏపీకి బదిలీ అయిన తర్వాత వెంట వెంటనే పదోన్నతులు కల్పించడంతో పాటు కీలకశాఖల బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆమె పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కీలక సమావేశాల్లోనూ సీఎం ఆమెకు ప్రాధాన్యత నిస్తున్నారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి స్థాయికి ఎదగాల్సిన శ్రీలక్ష్మికి సీబీఐ కేసులు ఇబ్బంది కలిగించాయన్న సానుభూతి సీఎంకు ఉంది. ఆ బాధ ఆమెలో తొలగించాలన్న భావనతో సీఎం ఉన్నారని, ఆ విధంగా చూస్తే శ్రీలక్ష్మికి సీఎస్ అయ్యే అవకాశం మెండుగా ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీనికితోడు ఆమెపై సీబీఐ నమోదు చేసిన కేసులు, అభియోగాలను తెలంగాణ హైకోర్టు కొట్టివేయడంతో శ్రీలక్ష్మికి మార్గం సుగమమైంది. ప్రస్తుతం ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ సమీర్‌శర్మ పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఇప్పటికే ఆయన పదవీకాలం ఒకసారి పొడిగించినందున ఇకపై పొడిగింపు అవకాశాలు లేనట్లే. శ్రీలక్ష్మి కంటే ముందు అంటే 1987 బ్యాచ్‌కు

- మిగతా 2 లో

సూపర్‌స్టార్ కృష్ణ ఆరోగ్యం విషమం

హైదరాబాద్: సూపర్‌స్టార్ కృష్ణ అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రాత్రి స్వల్ప గుండెపోటు, శ్వాస సంబంధిత సమస్య రావడంతో కుటుంబ సభ్యులు ఇంటి సమీపంలో ఉన్న కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి 2 గంటల సమయంలో వైద్యులు సీపీఆర్ చేసి చికిత్స అందించారు. కృష్ణ ఆరోగ్య పరిస్థితిపై కాంటినెంటల్ ఎండీ గురునాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ఆదివారం అర్ధరాత్రి కృష్ణగారిని ఆస్పత్రికి తీసుకొచ్చారు. గుండెపోటు రావడంతో ఎమర్జెన్సీకి తరలించి సీపీఆర్ చేశాం. 20 నిమిషాల తర్వాత ఆయన కార్డియక్ అరెస్ట్ నుంచి బయట కొచ్చారు. ఐసీయూకి తరలించి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నాం. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. 24 గంటల తర్వాత గానీ ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పలేం. మంగళవారం మధ్యాహ్నం హెల్త్ బులెటిన్ విడుదల చేస్తాం" అని తెలిపారు. మహేశ్ సహా కుటుంబ సభ్యులంతా ఆస్పత్రి దగ్గరే ఉన్నారు. కృష్ణ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న అభిమానులు ఇప్పటికే ఆస్పత్రికి చేరుకున్నట్లు తెలుస్తోంది.

రుద్రాక్ష గుట్ట బాధితులకు ఇళ్ల పట్టాల కోసం

సీపీఐ భారీ ర్యాలీ

- డోన్ తహసీల్దారు కార్యాలయం ముట్టడి
- తాటాకు చప్పుళ్లకు భయపడం: రామాంజనేయులు
- మంత్రి బుగ్గన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరిక

2లో

అక్రమ ఏజెన్సీలపై

ఉక్కుపాదం

- గనుల కార్యకలాపాల పెంపుపై దృష్టి
- సులభతర పన్ను చెల్లింపు ప్రక్రియ వేగవంతం
- అక్రమ మద్యం తయారీ, అమ్మకాలను నిరోధించండి
- ఆదాయశాఖల సమీక్షలో సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అందుబాటులో ఉన్న సమాచారం మేరకు తగిన కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఆదాయవనరుల శాఖలపై తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులకు మరింత అవగాహన కలిగించి, ఆ ప్రక్రియను మరింత సులభతరం చేయాలని వాణిజ్య పన్నులశాఖ అధికారులకు సూచించారు. దీనివల్ల చెల్లింపులు సకాలంలో జరుగుతాయని, పన్ను చెల్లించే వారికి చక్కటి సేవలు అందించినట్టు అవుతుందన్నారు. వాణిజ్య సలహా కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖపై సమీక్షించిన సీఎం,...గతంతో పోలిస్తే మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గినట్లు చెప్పారు. బెల్టుషాపులు తొలగించడం, పర్మిట్ రూమ్‌లు రద్దు వంటి నియంత్రణ చర్యల వల్ల అమ్మకాలు తగ్గాయని, ధరలు పెంచడం వల్ల మద్యం వినియోగం తగ్గిందని సీఎం వెల్లడించారు. అయితే అక్రమ మద్యం తయారీ, అమ్మకాలపై ఎస్ఈబీ ప్రత్యేక దృష్టి సారించాలని, వాటిని నివారించడానికి తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎస్ఈబీలో పరివర్తన కార్యక్రమంలో చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీసిన సీఎం... చేయూత, ఆసరా వంటి కార్యక్రమాల ద్వారా వారికి ఊతమివ్వాలని సూచించారు. గంజాయి,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సంస్కృతంలో మెడిసిన్, ఇంజనీరింగ్
ఈ ఐడియా ఎలా వుంది నాయనా!

బలవంతపు మతమార్పిళ్లు

తీవ్రమైన అంశమే

- ఏమి చర్యలు తీసుకుంటున్నారు?
- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం కోర్టు
- 22 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

న్యూఢిల్లీ: బలవంతపు మత మార్పిడి అత్యంత తీవ్రమైనదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టంచేసింది. ఈ ప్రక్రియను అడ్డుకోకపోతే చాలా క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. దీనిపై చర్యలు చేపట్టాలని కేంద్రానికి సూచించింది. దేశంలో కొన్నిచోట్ల జరుగుతున్న బలవంతపు మత మార్పిళ్లపై సుప్రీంకోర్టు విచారం వ్యక్తం చేసింది. ఇది చాలా తీవ్రమైన అంశమని, వాటిని గుర్తించి నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇలాంటి చర్యలను అరికట్టకపోతే అత్యంత క్లిష్టమైన పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించింది. దేశంలో బలవంతపు, మోసపూరిత మత మార్పిళ్లను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ప్రముఖ న్యాయవాది అశ్వినీకుమార్ ఉపాధ్యాయ్ సర్వోన్నత న్యాయస్థానంలో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ హిమా కోహ్లీ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

'ఇది చాలా తీవ్రమైన విషయం. బలవంతపు మత మార్పిళ్లను అరికట్టేందుకు కేంద్రం చిత్తశుద్ధితో పనిచేయాలి. లేదంటే చాలా క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. దేశ భద్రత, మత

- మిగతా 2 లో

పరస్పర సహకారంపై దృష్టి

జిన్‌పింగ్‌తో భేటీపై బైడెన్ వెల్లడి

నుసాదువా: విభేదాలను పరిష్కరించుకుంటూ పరస్పర సహకారానికి సాధ్యమయ్యే అంశాలను గుర్తిస్తామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. బైడెన్ అధికారానికి వచ్చిన తర్వాత మొదటిసారిగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ఇక్కడ కలుసుకున్నారు. జి20 గ్రూపు దేశాలు సమావేశంలో పాల్గొనేందుకు ఈ ఇరువురు నేతలు వచ్చారు. ఈ సందర్భంగా ఇండోనేషియాలోని విలాసవంతమైన హోటల్‌లో కలుసుకుని కరచాలనం చేశారు. అమెరికాతో సంబంధాలను మరింత పెంచుకునే అవకాశం ఏర్పడుతుందన్న ఆశాభావాన్ని జిన్‌పింగ్ వ్యక్తం చేశారు. లోతైన అంశాలను కూడా చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని కూడా జిన్‌పింగ్ అన్నారు. మధ్యంతర ఎన్నికల్లో పోటీ చేసిన డెమొక్రాట్లు అమెరికా సెనేట్‌లో మెజారిటీ సాధించిన నేపథ్యంలో బైడెన్ పరిస్థితి మరింత పటిష్టం కావచ్చునని భావిస్తున్నారు. బైడెన్ ఆదివారం కంబోడియా

- మిగతా 2 లో

స్లోవేనియా అధ్యక్ష ఎన్నికల్లో మహిళకు పట్టం

లుబ్లిజానా: స్లోవేనియా అధ్యక్ష పీఠాన్ని మొట్టమొదటిసారి ఓ మహిళ కైవసం చేసుకున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన న్యాయవాది నటాసా పిర్క్ ముసార్ ఆదివారం అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. సోవేనియన్ ఎన్నికల సంఘం విడుదల చేసిన డేటా ప్రకారం... 98శాతం ఓట్లను లెక్కించగా ముసార్ 53.97శాతం ఓట్లు సాధించగా, ఆమె ప్రత్యర్థి మాజీ మితవాద ప్రధాన మంత్రి జానెజ్ జాన్సా మిత్రుడైన అంజే లోగర్ 46.03 శాతం ఓట్లను పొందారు. మొత్తం ఇంకా 2శాతం ఓట్లను లెక్కించాల్సి ఉన్నప్పటికీ ఎన్నికల ఫలితాన్ని మార్చేంత సంఖ్యలో లేవు. ఇప్పటికే లోగర్ విజయం సాధించిన ముసార్‌ను అభినందించారు. ఆమె స్లోవేనియన్లందరికీ అధ్యక్షురాలిగా ఉంటుందని తన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తనకు ఓట్లు వేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ముసార్... ప్రస్తుత అధ్యక్షుడు బోరుట్ పహోర్ పదవీ కాలం ముగిసిన తర్వాత రాబోయే ఐదేళ్లపాటు అధ్యక్ష పదవిలో ఉంటారు. ఆమె డిసెంబరు 22న ప్రమాణ స్వీకారం చేస్తారు. పిర్క్ ముసార్ (54) స్లోవేనియాలో జన్మించి, అక్కడి పౌరసత్వాన్ని కలిగి ఉన్న అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భార్య మెలానియా ట్రంప్ తరపున న్యాయవాదిగా పనిచేశారు. మెలానియా ఒక పరువు నష్టం కేసులో ఒక టాబ్లాయిడ్‌పై దావా వేసినప్పుడు, ఇందుకోసం ఏర్పాటు చేసిన న్యాయ బృందంలో ముసార్ కూడా ఉన్నారు. గత నెలలో జరిగిన మొదటి రౌండ్ అధ్యక్ష ఎన్నికల్లో ముసార్ రెండవస్థానంలో నిలిచారు. మొత్తం ఏడుగురు అభ్యర్థుల్లో లోగర్ అధిక ఓట్లు సాధించారు. న్యాయవాది, జర్నలిస్టుగా పనిచేసిన ముసార్ స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచినప్పటికీ రెండో రౌండ్ ఎన్నికల్లో ప్రధాన మంత్రి రాబర్ట్ గోలోబ్ ప్రాతినిధ్యం వహిస్తున్న సెంటర్ లెఫ్ట్ ఫ్రీడమ్ మూవ్‌మెంట్, దీని సంకీర్ణ భాగస్వాముల్లో ఒకటైన సోషల్ డెమొక్రాట్స్ ముసార్‌కు మద్దతు పలికారు. స్లోవేనియా అధ్యక్ష బాధ్యతలు లాంఛనప్రాయమైనప్పటికీ అధ్యక్షుడు సైన్యాధిపతిగా ఉంటారు. ఎంతో ఉన్నతాధికారులను సిఫార్సు చేసే అధికారం ఉంటుంది. అన్ని సిఫార్సులను పార్లమెంటు ఆమోదం పొందాలి.

జపాన్‌లో భారీ భూకంపం

టోక్యో: జపాన్‌లో సోమవారం తీవ్రస్థాయిలో భూమి కంపించింది. అతి పెద్ద ద్వీపకల్పమైన హెూన్షుకి దక్షిణ తీరంలోని కన్సాయ్ ప్రాంతంలో భూకంపం సంభవించగా, రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.1గా నమోదయింది. మై ప్రిఫెక్టర్ దగ్గర సాయంత్రం 5:30 గంటలకు 357 కిలోమీటర్ల లోతున భూమి కంపించిందని జపాన్ వాతావరణ సంస్థ తెలిపింది.దాంతో స్థానికంగా తీవ్ర భయానక వాతావరణం నెలకొంది. తోబాకు ఆగ్నేయంగా 84 కిలోమీటర్ల దూరంలో మధ్యాహ్నం 1.38 గంటల ప్రాంతంలో భూకంపం సంభవించినట్లు అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) ధృవీకరించింది. రాజధాని టోక్యోతో పాటు చుట్టు పక్కల నగరాల్లో కూడా భూమి స్వల్పంగా కంపించిందని తెలిపింది. ద్వీపకల్పంలో భూకంపం రావడంతో సునామీ వస్తుందేమోనని అధికారులు భావించారు. అయితే, వాతావరణ శాఖ మాత్రం సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. ఫుకుషిమా అణు ఇంధన కేంద్రంలో ఎవరికీ గాయాలుగానీ, ప్రాణ నష్టం కాని సంభవించలేదని అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా బుల్లెట్ రైళ్లు, టోక్యో మెట్రోరైళ్లను నిలిపివేశారు. ఆ తర్వాత వాటిని పునరుద్దరించారు. నవంబర్12న నేపాల్‌లో కూడా 5.4 తీవ్రతతో భూకంపం సంభవించింది.

బ్రెజిల్ మహిళా నేతకు 50 ఏళ్ల జైలు

రియో డి జెనీరో: భర్తను హత్య చేసిన (2019లో) కేసులో బ్రెజిల్ మాజీ కాంగ్రెస్ మహిళ ఫ్లోర్డెలిస్ దాస్ శాంటోస్‌కు ఆదివారం 50 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రియోడి జెనీరో కోర్టు తీర్పునిచ్చింది. దాస్ శాంటోస్ (61), ఆమె భర్త, పాస్టర్ ఆండర్సన్ డో కార్మో రియో డి జెనీరో మురికివాడల నుంచి డజన్ల కొద్దీ వీధి పిల్లలను దత్తత తీసుకోవడంలో ప్రసిద్ధి చెందారు. ఈ జంట బ్రెజిల్‌లో అభివృద్ధి చెందుతున్న ఎవాంజెలికల్ క్రిస్టియన్ ఉద్యమంలో పవర్ కపుల్ గా ఉన్నారు. ఆండర్సన్ డో కార్మో 2019 జూన్ లో రియోసబర్బ్ లోని తమ ఇంట్లో బుల్లెట్ గాయాలతో తుదిశ్వాస విడిచాడు. ప్రాసిక్యూటర్లు ఆగస్టు 2020లో దాస్ శాంటోస్‌పై మనిషిని హత్యచేయడంతో పాటు దానిని సాయుధ దోపిడీగా మరుగుపరచడానికి ప్రయత్నించారని అభియోగాలు మోపారు. ఈ నేరంలో ఆమె ఎదిగిన పిల్లలలో చాలా మంది పాల్గొన్నారు. ఆర్థిక వ్యవహారాలపై ఎవరికి అధికారం ఉండాలన్న విషయంలో గొడవల వల్లే అనుమానాస్పద హత్య జరిగిందని అంటున్నారు. ఆస్తి మీద తన అధికారం కోసం 42 ఏళ్ల డో కార్మో దారుణంగా వ్యవహరించారని న్యాయవాదులు తెలిపారు. అయితే పార్లమెంటు సభ్యురాలు కావడం వల్ల ఆమె పార్లమెంటరీ ఇమ్యూనిటీతో రక్షించబడ్డారు. అయితే ఆగస్టు 2021లో ఆమె సహచరులు ఏకగ్రీవ ఓటుతో ఆమెను తొలగించడంతో ఇమ్యూనిటీ కోల్పోయారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆఫీస్ ఫిర్యాదు ప్రకారం, మాజీ కాంగ్రెస్ మహిళ తన భర్తను గతంలో కనీసం ఆరు సందర్భాలలో విషంతో చంపడానికి ప్రయత్నించినందుకు, అలాగే పత్రాల ఫోర్జరీ, ఆర్మ్ డ్ క్రిమినల్ అసోసియేషన్ లలో కూడా దోషిగా తేలారు. 2018లో కన్జర్వేటివ్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ తరపున డోస్ శాంటోస్ కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. జాకరెజిన్హోలోని రియోఫవేలా మురికివాడలో జన్మించిన ఆమె 1994లో దో కార్మోను కలుసుకున్నారు. వారిద్దరూ కలిసి కమ్యూనిటీ ఆఫ్ ఎవాంజెలికల్ మినిస్ట్రీ ఫ్లోర్డెలిస్ అనే సంస్థను స్థాపించారు. ఈ దంపతుల ఐదుగురు పిల్లలతో పాటు, వారి మనవరాలు కూడా నిందితులుగా విచారణలో ఉన్నారు. మాజీ కాంగ్రెస్ మహిళ దత్తత కూతురు సిమోన్ దాస్ శాంటోస్ రోడ్రిగ్స్‌కు కూడా ఈ కేసులో ఆదివారం 31 సంవత్సరాల జైలు శిక్ష విధించబడింది.

ఇస్తాంబుల్ పేలుడు వెనుక కుర్దిష్ ఉగ్ర సంస్థ

అంకారా: సెంట్రల్ ఇస్తాంబుల్‌లో జరిగిన పేలుడు వెనుక కుర్దిష్ ఉగ్రవాద సంస్థ పీకేకే గ్రూప్ ఉన్నట్లు టర్కీ మంత్రి సులేమాన్ సోయులు స్థానిక మీడియాకు తెలిపారు. ఈ దాడికి సూత్రధారిగా భావిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కూడా వెల్లడించారు. ఆదివారం ఇస్తాంబుల్‌లో జరిగిన పేలుడులో ఆరుగురు మరణించగా, 81 మంది గాయపడిన సంగతి తెలిసిందే. స్థానిక కాలమానం ప్రకారం.. ఆదివారం సాయంత్రం 4.20 గంటల సమయంలో నిత్యం పర్యాటకులు, స్థానికులతో రద్దీగా ఉండే బెయోగ్లు జిల్లాలోని ఇస్తిక్ లాల్ షాపింగ్ స్ట్రీట్ లో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. సుమారు 50-55 మీటర్ల వరకు ఈ పేలుడు శబ్దం వినిపించిందని, ప్రజలు భయంతో పరుగులు తీసినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఆ ప్రాంతంలో ఆంక్షలు విధించినట్లు వెల్లడించింది. ఇది నీచమైన దాడి అని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ మీడియాతో అన్నారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించామని చెప్పారు.

పరస్పర సహకారంపై దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

రాజధాని నామ్‌ఫెన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, మా మధ్య కొన్ని అంశాలపై అవగాహన లోపం ఉందని అన్నారు. ఇండోనేషియా చేరుకోవడానికి ముందు ఆయన దక్షిణాసియా దేశాల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభేదాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించడం అవసరం. రానున్న రెండు సంవత్సరాల్లోనూ ఇరు దేశాలకు ముఖ్యమైన అంశాలను గుర్తిస్తామని బైడెన్ అన్నారు. నా పరిస్థితులు మారిపోయాయి. దేశంలో అందరికీ ఇది తెలుసు. నేను మరింత బలపడుతున్నానని కూడా తెలుసు అని బైడెన్ అన్నారు. రెండు దేశాల మధ్య గల సంఘర్షణలను తక్కువచేసి చూపించడానికి వైట్‌హౌస్ పదేపదే ప్రయత్నం చేసింది. అమెరికాలో ఏర్పడిన వివిధ ప్రభుత్వాల కాలంలో చైనాతో సంబంధాలు ఘర్షణస్థాయిలోనే కొనసాగాయి. ఆర్థిక, వాణిజ్యం, మానవహక్కులు, భద్రత వ్యవహారాలపై విభేదాలు తీవ్రంగానే ఉన్నాయి. తైవాన్ విషయంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలేర్పడ్డాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వ్యవహారంలో రష్యా అధికారులు బహిరంగంగా వ్యాఖ్యానాలు చేయలేదు. యుద్ధం విషయంలో ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఇప్పుడే కనిపించడంలేదు.

కేంద్రం రేషన్ ఝలక్

(మొదటిపేజీ తరువాయి)

విషయంపై సీరియస్ అయిన ప్రభుత్వం వారిపై కూడా చర్యలు తీసుకోవాలని అధికారులని ఆదేశించింది. బీజేపీ అధికారంలోవున్న ఉత్తరప్రదేశ్‌లో చాలా వరకు రేషన్ కార్డులు దుర్వినియోగం జరుగుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గత కొంత కాలంగా ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద, తెలుపు, గులాబీ రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా ఐదు కిలోల బియ్యం ఉచితంగా లభిస్తున్న సంగతి తెలిసిందే.

తీవ్రమైన అంశమే

(మొదటిపేజీ తరువాయి)

స్వేచ్ఛను ప్రభావితం చేసే సమస్య ఇది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీనిపై చర్యలు చేపట్టాలి' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇలాంటి మతమార్పిళ్లను అరికట్టేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. రాజ్యాంగ అసెంబ్లీలో సైతం దీనిపై చర్చ జరిగిందని మెహతా ధర్మాసనానికి విన్నవించారు. 'మత మార్పిళ్ల నియంత్రణకు రెండు చట్టాలు వచ్చాయి. అందులో ఒకటి ఒడిశా ప్రభుత్వం తీసుకురాగా, మరొకటి మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూపొందించింది. బలవంతంగానూ, ప్రలోభాలకు గురిచేసి లేదా భయపెట్టి మతమార్పిళ్లకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని ఆ రెండు చట్టాలు స్పష్టంచేశాయి. ఈ రెండు చట్టాలు సైతం పరిశీలన కోసం సుప్రీంకోర్టు ముందుకు వచ్చాయని గుర్తుచేశారు. వీటికి సంబంధించిన విచారణ సుప్రీంలో పెండింగ్‌లో ఉంది' అని మెహతా వివరించారు. బలవంతపు మత మార్పిళ్లు గిరిజన ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయని తెలిపారు. తాము నేరపూరిత చర్యకు పాల్పడుతున్నామని బాధితులకు తెలియదని, దీనిపై అవగాహన కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఎవరికైనా మత స్వేచ్ఛ ఉండవచ్చని, అయితే బలవంతపు మత మార్పిడి ద్వారా వచ్చే మత స్వేచ్ఛను అంగీకరించేది లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. మత మార్పిళ్లు నిజమని తేలితే దీనిని తీవ్రంగా పరిగణించాల్సిందేనని, అంతిమంగా ఇది దేశ భద్రతపై చెడు ప్రభావం చూపుతుందని పేర్కొంది. 'అందువల్ల దీనిపై కేంద్ర ప్రభుత్వం ఓ స్పష్టమైన వైఖరి తీసుకోవాలి. మత మార్పిళ్లను నియంత్రించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలుపుతూ కేంద్రం కౌంటర్ దాఖలు చేయాలి' అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొన్నది. కౌంటర్ దాఖలుకు నవంబరు 22వ తేదీ వరకు కేంద్రానికి గడువిచ్చిన ధర్మాసనం...తదుపరి విచారణను నవంబరు 28కి వాయిదా వేసింది.

అక్రమ ఏజెన్సీలపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

అక్రమ మద్యం కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఏజెన్సీలో గంజాయి నివారణ చర్యలు చేస్తూనే... మరోపక్క ఉపాధి మార్గాలు కల్పించాలన్నారు. వారికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని, లేకపోతే అర్హులైన వారందరికీ తక్షణమే పట్టాలివ్వాలన్నారు. తద్వారా పట్టాలు వచ్చిన రైతులకు రైతు భరోసా లభిస్తుందని, విత్తనాలు, ఎరువులు అందించాలని, అప్పుడే ఆశించిన స్థాయిలో మార్పు వస్తుందన్నారు. దీనివల్ల అక్రమ మద్యం, గంజాయి సాగు నుంచి రైతులు దూరమవుతారని సీఎం మార్గనిర్దేశనం చేశారు. శాశ్వత భూహక్కు, భూసర్వే కార్యక్రమం చేపడుతున్న గ్రామాల్లో...వార్డుల్లో...సబ్‌రిజిస్ట్రార్ భవనం, సేవలు వంటి వాటిపై అవగాహన కలిగించడంతో పాటు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి చైతన్యం కల్పించాలని సీఎం సూచించారు. గనులశాఖపై సమీక్షిస్తూ నిరుపయోగంగా ఉన్న మైనింగ్ ఏరియాలో కార్యకలాపాలు మొదలయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో విద్యుత్, అటవీ, పర్యావరణ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎస్ సమీర్‌శర్మ, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్, రాష్ట్ర పన్నుల ముఖ్య కమిషనర్ గిరిజా శంకర్, సీఐడీ ఏడీజీ పీవీ సునీల్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రుద్రాక్ష గుట్ట బాధితులకు ఇళ్ల పట్టాల కోసం
సీపీఐ భారీ ర్యాలీ

విశాలాంధ్ర-డోన్: నంద్యాల జిల్లాలో రుద్రాక్షగుట్ట బాధితుల కోసం సీపీఐ భారీ ఆందోళన చేపట్టింది. తమను అడుగడుగునా మోసగిస్తున్న పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీని వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని మండిపడింది. ఇప్పటికైనా బాధితులకు న్యాయం చేయకపోతే వచ్చే ఎన్నికల్లో తడాఖా చేపిస్తామని హెచ్చరించింది. రుద్రాక్ష గుట్ట బాధితులకు స్థలాలు కేటాయించాలని కోరుతూ నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో సోమవారం సీపీఐ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు వందలాది మంది లబ్ధిదారులతో భారీ ర్యాలీ జరిగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ బెదిరింపులకు... తాటాకు చప్పుళ్లకు భయపడబోమని స్పష్టం చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బి.నారాయణ అధ్యక్షతన జరిగిన ముట్టడి కార్యక్రమానికి రామాంజనేయులు సహా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి పులి శేఖర్ హాజరయ్యారు. పేదలకు పట్టాలివ్వాలని 2007 నుంచి పోరాటం చేస్తున్నట్లు రామాంజనేయులు చెప్పారు. 2007లో రుద్రాక్షగుట్టలో పేద ప్రజలు సీపీఐ అధ్వర్యంలో 750 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. అప్పటి ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా కొంతమందికి పట్టాలు ఇప్పించారన్నారు. సుజాతమ్మ ఓటమిచెందిన తర్వాత డోన్‌లో కేఈ కృష్ణమూర్తి ఎమ్మెల్యేగా గెలుపొందారని, ఆయన కూడా పేదలను పట్టించుకోలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు పట్టాలిస్తామని ప్రస్తుతం ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇప్పుడు అభివృద్ధి మాటున పేదలు నిర్మించుకున్న ఇళ్ల స్థలాల దగ్గర 100 పడకల ఆసుపత్రి నిర్మిస్తామని, ఇందుకు సీపీఐ మద్దతివ్వాలని అభ్యర్థించారని రామాంజనేయులు వివరించారు. అంతేకాకుండా ఆ స్థలంలో ఇళ్లు కోల్పోయిన వారికి పక్కన ఇంటి పట్టాతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని, దీనిని నమ్మి సీపీఐ అంగీకరించిందన్నారు. మాటతప్పిన మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి... రెవెన్యూ అధికారులు, పోలీసులతో 100 పడకల ఆసుపత్రి పక్కనే రెసిడెన్షియల్ పాఠశాల, నర్సింగ్ కళాశాల నిర్మించడానికి పేదలు నిర్మించుకున్న ఇళ్లు కూల్చారన్నారు. దీంతో లక్షల రూపాయలను పేదలు నష్టపోయారన్నారు. అడ్డుకున్న సీపీఐ నాయకులపై కేసులు బనాయించారన్నారు. మాటతప్పిన మంత్రి బుగ్గనకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వైసీపీ కార్యాలయంలో అభివృద్ధి మాటున అవినీతి జరుగుతోందని ఆరోపించారు. మంత్రి బుగ్గనను ఓడించడానికి పట్టణ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. రుద్రాక్ష గుట్ట లబ్ధిదారులకు న్యాయం చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. అవసరమైతే సీపీఐ అధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో సీపీఐ ప్యాపిలి మండల కార్యదర్శి వెంకటేశ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి వరదరాజు, హుస్సేన్ పీరా, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, సర్పంచ్ జె.రవిమోహన్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అబ్బాస్, పుల్లయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ప్రభాకర్, గౌండ భాష, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు చిన్న రంగన్న, నారాయణ, రామకృష్ణ, సురేశ్, సుంకన్న, సుధాకర్, అన్వర్, వెంకటేశ్, విజయ్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు ఎర కేసు బెయిల్ పిటిషన్ కొట్టివేత

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు రేపిన ఎమ్మెల్యేలకు ఎర కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితుల బెయిల్ పిటిషన్‌ను అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) ప్రత్యేక న్యాయస్థానం కొట్టివేసింది. దర్యాప్తు వేళ బెయిల్ మంజూరు చేస్తే ఆటంకాలు ఎదురవుతాయని పోలీసుల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆయనతో ఏకీభవించిన న్యాయస్థానం బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. ఎమ్మెల్యేల ఎర కేసులో నిందితులుగా ఉన్న నందకుమార్, సింహయాజులు, రామచంద్ర భారతి ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. మరోవైపు ఎమ్మెల్యేలకు ఎర కేసులో విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. కేసు దర్యాప్తుపై విధించిన స్టేను ఎత్తివేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి సీజే ధర్మాసనాన్ని శనివారం ఆశ్రయించిన విషయం తెలిసిందే. స్టేను యథాతథంగా కొనసాగించేలా ఆదేశాలివ్వాలని, సీబీఐ లేదా ప్రత్యేక దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని ఆయన కోర్టును కోరారు. దీనిపై అత్యవసరంగా విచారణ జరిపించాలని ప్రేమేందర్ తరపు న్యాయవాది సోమవారం కోర్టును కోరారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం మంగళవారం విచారణ చేపడతామని పేర్కొంది.

కొత్త సీఎస్ శ్రీలక్ష్మి ?

(మొదటిపేజీ తరువాయి)

చెందిన నీరబ్‌కుమార్ ప్రసాద్‌తో పాటు 1988 బ్యాచ్‌కు చెందిన పూనం మాలకొండయ్య, ఎ.గిరిధర్, 1990 బ్యాచ్‌కు చెందిన జవహర్ రెడ్డి కూడా సీఎస్ రేసులో ఉన్నారు. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ సీఎస్‌గా నీరబ్ కుమార్ ప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధానకార్యదర్శిగా జవహర్ రెడ్డి, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్‌గా పూనం మాలకొండయ్య కీలక బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, గిరిధర్ కేంద్ర సర్వీసులో ఉన్నారు. వీరిలో శ్రీలక్ష్మి తర్వాత జవహర్ రెడ్డికి సీఎం ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆయనను ఇప్పటికే సీఎంవోలో నియమించుకున్నందున జవహర్ రెడ్డికి కూడా అవకాశం లేకపోలేదని చెపుతున్నారు. అయితే శ్రీలక్ష్మి అతని కంటే సీనియర్ కావడం, ముఖ్యమంత్రికి ఆమెపై ప్రత్యేక సానుభూతి ఉండటంతో నూటికి నూరు శాతం కొత్త సీఎస్ పదవి శ్రీలక్ష్మినే వరిస్తుందని సీనియర్ ఐఏఎస్‌లు స్పష్టం చేస్తున్నారు. డిప్యుటేషన్‌పై తెలంగాణ నుండి ఏపీకి శ్రీలక్ష్మి వచ్చిన లక్ష్యం కూడా అదేనని పేర్కొంటున్నారు.

సకాలంలో గమ్యం చేరని
24 శాతం రైళ్లు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా భారతీయ రైల్వే నడుపుతున్న రైళ్లలో 23.8 శాతం మేర సకాలంలో గమ్యం చేరడం లేదని రైల్వేశాఖ వెల్లడించింది. సమాచార హక్కు చట్టం కింద ఆర్టీఐ కార్యకర్త ఇనగంటి రవికుమార్ అడిగిన ప్రశ్నకు రైల్వేశాఖ ఈ మేరకు బదులిచ్చింది. దేశవ్యాప్తంగా భారతీయ రైల్వే నడుపుతున్న రైళ్లలో 23.8 శాతం మేర సకాలంలో గమ్యం చేరడం లేదని రైల్వేశాఖ తెలిపింది. 2016 నుంచి 2022 సెప్టెంబరు వరకు 76.20 శాతం రైళ్లు సకాలంలో గమ్యాన్ని చేరుకున్నాయని పేర్కొంది. ఆ కాలంలో దేశవ్యాప్తంగా 76,89,535 సర్వీసులను నడిపినట్లు భారతీయ రైల్వే వెల్లడించింది. ఇందులో 58,59,631 రైళ్లు సకాలంలో నిర్దేశించిన గమ్యాన్ని చేరుకోగా 18, 29,904 సర్వీసులు ఆలస్యమైనట్లు పేర్కొంది. ప్రస్తుతం సగటున ప్రతిరోజు 34.20 లక్షల మంది రైళ్లలో ప్రయాణం చేస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 694 రాజధాని రైళ్లు ఆలస్యంగా నడిచినట్లు తెలిపింది. దురంతో 841, శతాబ్ది 285, జనశతాబ్ది 636, మెయిల్/ఎక్స్ ప్రెస్ 23,189, ప్యాసింజర్ రైళ్లు 49,364 ఆలస్యంగా గమ్యానికి చేరినట్లు భారతీయ రైల్వే పేర్కొంది.

కేంద్రానికి సుప్రీం జరిమానా

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ పరికరాల మార్గదర్శకాల పిటిషన్‌పై కేంద్రం ప్రతిస్పందించకపోవడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కేంద్రానికి రూ. 25,000 జరిమానా విధించింది. దర్యాప్తులో భాగంగా స్వాధీనం చేసుకునే ఎలక్ట్రానిక్ పరిరకాల్లో జీవితకాల సమాచారం ఉంటుందని, వాటిని భద్రపరచాల్సి వుంటుందని జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం ప్రజల జీవితాల్లో అవి భాగస్వామ్యమయ్యాయని, ఈ సమస్యపై అంతర్జాతీయంగా తీసుకుంటున్న చర్యలతో పాటు ఇతర వివరాలను రికార్డ్‌లో ఉంచాలని కేంద్రాన్ని ఆదేశించింది. అయితే అఫిడవిట్ దాఖలు చేసేందుకు ఆరువారాల సమయం ఇవ్వాల్సిందిగా అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు కోర్టుని కోరారు. ఈ పిటిషన్‌పై గత ఆగస్టులో కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌పై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. కేసు విచారణల్లో భాగంగా దర్యాప్తు సంస్థలు స్వాధీనం చేసుకునే ఎలక్ట్రానిక్ పరికరాలకు సంబంధించి మార్గదర్శకాలను రూపొందించాలని కొందరు నిపుణులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కొన్నేళ్ల పాటు తాము నిర్వహించిన విధులకు సంబంధించి అన్ని వివరాలు ల్యాప్‌టాప్‌తో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఉంటాయని, దర్యాప్తు సంస్థలు వాటిని సరిగా భద్రపరచకపోతే కోలుకోలేని నష్టాలకు దారితీస్తాయని జేఎన్‌యూ ప్రొఫెసర్ రామస్వామి, సావిత్రిబాయి పూలే పూణె యూనివర్సిటీ ప్రొఫెసర్ సుజాతా పటేల్, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాధవ్ ప్రసాద్, జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ముకుల్ కేశవన్, సైద్ధాంతిక పర్యావరణ ఆర్థికవేత్త దీపక్ మల్ఘన్‌లు ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు.

దివాలా దిశగా 50కిపైగా దేశాలు

- ఐక్య రాజ్య సమితి హెచ్చరిక
- సంపన్న దేశాల ఆపన్నహస్తానికి పిలుపు

షర్మల్ షేక్: ప్రపంచాన్ని అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. ఆకలి, పేదరికం, ద్రవ్యోల్బణం, వాతావరణం తదితరాలు పెద్ద సవాళ్లుగా నిలిచాయి. ఇలాంటి పరిస్థితుల నడుమ అనేక దేశాలకు అప్పులే శరణ్యమవుతున్నాయి. అయితే ఆర్థిక వ్యవస్థలు గాడి తప్పుతుండటంతో కోలుకోలేక, రుణాలను తిరిగి చెల్లించలేక దివాళా అంచునకు చేరుకుంటున్నాయి. ఇదే విషయంలో సీఓపీ వాతావరణ సదస్సులో ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తంచేసింది. 50కిపైగా అభివృద్ధి చెందుతున్న పేద దేశాలు దివాలా అంచునకు చేరుకున్నట్లు ఐరాస హెచ్చరించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ విధంగా అప్పుల ఊబిలో చిక్కుకుపోవడం విపత్కర పరిణామమని పేర్కొంది. శ్రీలంక దుస్థితిని ప్రస్తావించింది. ఆదుకోవాలంటూ సంపన్న దేశాలకు పిలుపునిచ్చింది. తక్షణమే సాయం అందకపోతే ఈ దేశాలు దివాలా తీస్తాయని ఐరాస అభివృద్ధి కార్యక్రమం హెడ్ అచిమ్ స్టెయినర్ హెచ్చరించారు. ద్రవ్యోల్బణం, ఇంధన సంక్షోభం, పెరుగుతున్న వడ్డీ రేట్లు ఈ పరిస్థితికి కారణమవుతున్నట్లు తెలిపారు. ఇలాంటి పరిస్థితిలో 54 దేశాలు ఉన్నట్లు చెప్పారు. అప్పులు తీర్చలేక సమస్యలు మరింత జటిలమవుతున్నాయని అన్నారు. ఇంధనం- ఆహారం సంక్షోభం ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు తెలిపారు. చాలా దేశాల్లో ఆర్థిక వ్యవస్థ పతనం అంచునకు చేరుకోవడంతో అప్పు చెల్లించే పరిస్థితి లేదన్నారు. పేద దేశాలకు తక్షణమే ఆపన్నహస్తం అందకపోతే వాటి మనుగడ కష్టసాధ్యమవుతుందని, వాతావరణ సంక్షోభాన్ని తట్టుకొని నిలబడలేవని హెచ్చరించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు రుణచెల్లింపులు పెనుసవాళ్లుగా మారాయని, తక్షణమే ఆ దేశాలకు ద్రవ్యసాయం అవసరమని, పెట్టుబడులకు సహకరించాలని సూచించారు. లేనిపక్షంలో తీవ్రమైన వాతావరణపరమైన ఒత్తిళ్లకు ఆ దేశాలు తట్టుకోలేవని స్టెయినర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇచ్చిన హామీ ప్రకారం సంపన్న ప్రపంచం నుంచి నిధులు పేద దేశాలకు సమకూరకపోయినాగానీ ఆ దేశాలు తుపాన్లు, వరదలు, కరవు ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఏటా 100 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని సంపన్న దేశాల ప్రభుత్వాలు నిలబెట్టుకోకపోతే పేద దేశాలు ఐరాస వాతావరణ చర్చలను వదిలి వెళ్లే పరిస్థితి నెలకొన్నట్లు స్టెయినర్ తెలిపారు. గ్రీన్‌హౌస్ ఉద్గారాలు తగ్గించేందుకు, కఠిన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలకు సహకారం తక్షణావశ్యమని నొక్కిచెప్పారు. వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చైనా, భారత్‌తో పాటు కెన్యా, దక్షిణాఫ్రికా, ఘనా, మొరొకో, ఈజిప్టు వంటి దేశాలు కూడా శుద్ధ ఇంధనం కోసం పెట్టుబడులు పెడుతున్నాయని అన్నారు. ప్రకృతి విపత్తులప్పుడు 'అసాధారణ' వనరులను వినియోగిస్తుంటుందని చెప్పారు.

గ్రామ సచివాలయాల్లో గ్రంథాలయాలు

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

జాతీయ గ్రంథాలయ వారోత్సవం ప్రారంభం

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: గ్రంథాలయాలకు తమ ప్రభుత్వం అమిత ప్రాధాన్యతనిస్తుందని, రాష్ట్రాన్ని సంపూర్ణ డిజిటల్ గ్రంథాలయ వ్యవస్థగా తీర్చిదిద్దు తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. గ్రంథా లయాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరి స్తుందని, ప్రతి గ్రామ సచివాలయంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలనేది తమ ఆలోచనని పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలోనే మొట్టమొదట డిజిటల్ గ్రంథాల యాల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వమే తీసుకొచ్చిందన్నారు. మన చరిత్ర, సంస్కృతి, సంప్రదా యాలను భావితరాలకు అందించే గొప్ప వ్యవస్థే గ్రంథాలయాలు అని కొనియాడారు. వేదకాలం నాటి గ్రంథాలను గుర్తించి వాటిని కాపాడేందుకు, ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ...గత ప్రభుత్వాలు గ్రంథాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని భావించాయని, గ్రంథాలయాల అభివృద్ధికి వినియోగించాల్సిన నిధులను వేరే కార్యక్రమాలకు మళ్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయ వ్యవస్థ పరిఢవిల్లేందుకు అందరం కృషి చేస్తున్నామన్నారు. ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ మాట్లాడుతూ...ఏ ప్రాంతంలో అయితే ప్రజలందరూ గ్రంథాలయాలకు వెళ్లి వస్తుంటారో ఆ ప్రాంతమంతా విజ్ఞానంతో ప్రజ్వరిల్లుతుందన్నారు. గ్రంథాలయ ఉద్యమానికి కృష్ణాజిల్లా కేంద్రబిందువుగా ఉందన్నారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ... కేవలం పిల్లలు పుస్తకాలు చదవాలని చెబితే సరిపోదని, బోధన విధానం కూడా మారాలన్నారు. ఎమ్మెల్సీ టి.కల్పలత మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గొప్ప వ్యక్తుల చరిత్రను పరిశీలిస్తే వారి విజయాల వెనుక కచ్చితంగా 'పుస్తక పఠనం' ఉంటుందన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ...పిల్లలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి కేవలం చదువు, విజ్ఞానం మాత్రమేనన్నారు. ప్రయోగ పద్ధతిలో విద్యను మార్పు చేయాలన్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ... ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా గ్రంథాలయం ఉండాలన్నారు. పుస్తకం చదవడమనేది వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు ఎస్. ఢిల్లీరావు, కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరపల్లి జమల పూర్ణమ్మ, పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పుణ్యశీల, పౌర గ్రంథాలయశాఖ డైరెక్టర్ ఎంఆర్. ప్రసన్న కుమార్, ఎన్టీఆర్ జిల్లా డీఈవో రేణుక, డిప్యూటీ డీఈవో రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గలేదు

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గాయనడం సత్య దూరమని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన డిగ్రీ కోర్సుల ప్రవేశాల ప్రక్రియపై ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే.శ్యామలరావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డితో విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఉత్తీర్ణులైన 3,37,987 మంది విద్యార్థుల్లో దాదాపు 3,15,600 మంది (93.38శాతం) విద్యార్థులు వివిధ కోర్సుల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రవేశం పొందారన్నారు. గతంలో కంటే డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పడిపోయాయంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. సీఎం జగన్ విద్యా రంగంపై ప్రధాన దృష్టి కేంద్రీకరించిన నేపథ్యంలో ఈ ఏడాదిలో ఇంతవరకు ఇంజనీరింగ్ కోర్సుల్లో లక్షా 20వేల మంది, ఫార్మసీలో 12వేల మంది, వ్యవసాయం- ఆక్వాకల్చర్‌లో 5 వేల మంది తోపాటు, వైద్య, నర్సింగ్ కోర్సుల్లో 15వేల మంది ప్రవేశాలు పొందారని వివరించారు. వివిధ డిగ్రీ కోర్సుల్లో లక్షా 48వేల మంది, ఐఐఐటి, ఎన్ఐటీ వంటి కోర్సుల్లో 5600 మంది, ఇతర రాష్ట్రాల్లో మరో 10వేల మంది ప్రవేశాలు పొందారన్నారు. బోధనపరంగా బీఈడీ కళాశాలల్లో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయాల ఉప కులపతులకు మంత్రి సూచించారు. బీఈడీ కళాశాలల్లోని ప్రమాణాలపై ఫిర్యాదులు వస్తున్న దరిమిలా, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరలో తనిఖీలను పూర్తి చేసి, బీఇడి కోర్సుల ప్రవేశాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

మధుమేహం నివారణపై అవగాహన కల్పించాలి

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మధుమేహ వ్యాధి ప్రధాన ఆరోగ్య సమస్యగా మారిందని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి పదిమంది వయోజనులలో ఒకరిలో ప్రమాదకర స్థాయికి చేరుకుందని తెలిపారు. వ్యాధి సోకిన వారిలో సగం మందికి మధుమేహం ఉందని కూడా తెలియదన్నారు. వీజీఆర్ డయాబెటీస్ ఎడ్యుకేషన్, అవేర్‌నెస్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో సోమవారం సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ మధుమేహ దినోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచంలోనే అత్యధికంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు భారతదేశంలోనే ఉన్నారని, వారి సంఖ్య చాలా వేగంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తగిన ప్రచారం ద్వారా వ్యాధి నివారణ, రాకుండా అవలంబించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మధుమేహం రాకుండా ఎలా నివారించాలో ప్రజలకు తెలియచెప్పాలన్నారు. సరైన ఆరోగ్య, మౌలిక సదుపాయాలు లేకపోవడం, అక్షరాస్యత రేటు తక్కువగా ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాలపై ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. స్థానిక భాషలో ప్రచురణలను ముద్రించి ప్రజలకు పంపిణీ చేయాలని గవర్నర్ సూచించారు. ఈ సందర్భంగా వివిధ వైద్య విభాగాలలోని సీనియర్ వైద్యులను గవర్నర్ సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్. సోమయాజులు, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఉపకులపతి డాక్టర్ శ్యామ్ ప్రసాద్, రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎ. శ్రీధర్ రెడ్డి, బీజేపీ నేత పాతూరి నాగభూషణం, ఇండియన్ సైకియాట్రిక్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బా రెడ్డి, ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలోనే ప్రప్రథమంగా చిత్తూరుజిల్లా చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 0-10 ఏళ్ల వయసు ఆడ పిల్లలందరికీ తపాలా కార్యాలయాల్లో సుకన్య సమృద్ధి ఖాతా లను తెరవడంపై ఆంధ్రప్రదేశ్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ అభినవ్ వాలియా ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. 2022 సంవత్సరానికిగాను 3వేల సుకన్య సమృద్ధి ఖాతాల ప్రాథమిక డిపాజిట్ కోసం డా. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రూ.7లక్షల 50వేల ఆర్థిక సాయం అందించగా, ఇప్పటివరకు 15,586 మందికి సుకన్య సమృద్ధి ఖాతాలను చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని వివిధ తపాలా కార్యాలయాల్లో తెరిచారన్నారు. చెవిరెడ్డి ఆర్థిక సాయంతో చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నివసించే అర్హత కలిగిన 0-10 ఏళ్ల వయసున్న ఆడ పిల్లలందరికీ ఆయా తపాలా కార్యాలయాల్లో సుకన్య సమృద్ధి ఖాతాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.

కాంతారావుకు కన్నీటి వీడ్కోలు

విశాలాంధ్ర-నరసరావుపేట: అనారోగ్యంతో మృతి చెందిన పల్నాడు జిల్లా సీపీఐ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది సీహెచ్ఎల్ కాంతారావు అంత్యక్రియలు సోమవారం నరసరావుపేట పట్టణంలో జరిగాయి. కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. పట్టణంలోని రామిరెడ్డిపేట గల కాంతారావు స్వగృహం నుంచి అంతిమయాత్ర ప్రారంభమైంది. ఇందులో సీపీఐతో పాటు ఇతర వామపక్షాలు, కార్మిక సంఘాలు, టీడీపీ, వైసీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కాంతారావు అమర్ రహే అంటూ జోహార్లు అర్పించారు. అంతిమయాత్ర రామిరెడ్డిపేట నుంచి పల్నాడు బస్టాండ్, గడియార స్తంభం సెంటర్, మల్లమ్మ సెంటర్ మీదుగా గుంటూరు రోడ్‌లోని స్వర్గపురి వరకు కొనసాగింది. పార్టీలకతీతంగా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఐకి తీరనిలోటు: ముప్పాళ్ల

అంతకుముందు ఇంటి వద్ద సంతాప సభ జరిగింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంతారావు మృతి సీపీఐకి, కార్మికలోకానికి తీరనిలోటన్నారు. దశాబ్దాల క్రితం పల్నాడు ప్రాంతంలో పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా పేద, బడుగు, బలహీన వర్గాల కోసం త్రికరణశుద్ధిగా పోరాటాలు చేసిన ధీశాలి కాంతారావు అని కొనియాడారు. 1965లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పీడబ్ల్యూడీ కెనాల్స్, వర్కర్స్ యూనియన్ స్థాపించిన నాటి నుంచి తుదిశ్వాస విడిచే వరకు ఆ యూనియన్‌కు అధ్యక్షులుగా పనిచేశారని, కార్మి కుల పక్షాన పోరాడి వందలాదిమంది తాత్కాలిక కార్మికులను పర్మినెంట్ చేయించిన ఘనత కాంతారావుకు దక్కుతుందని చెప్పారు.

సీనియర్ న్యాయవాదిగా పార్టీలకతీతంగా అందరి మన్ననలు పొందారని అన్నారు. టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కాంతారావు తమకు ఎన్నో న్యాయ సలహాలు ఇచ్చారని, ఆయన లేనిలోటు తీరనిదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్, రాష్ట్ర నాయకులు వై.చెంచయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, షేక్ హుస్సేన్...కాంతారావు సేవలను, పోరాటాలను కొనియాడారు. అంతకు ముందు కాంతారావు భౌతికకాయంపై సీపీఐ జెండాను కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, రైతుసంఘం అధ్యక్షుడు గొట్టిపాటి జనార్ధన్‌బాబు, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, ఏఐటీయూసీ గుంటూరు జిల్లా నాయకులు రావుల అంజిబాబు, ఏఐవైఎఫ్ నాయకులు షేక్ సుభాని, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ అరవింద బాబు, గుంటూరు జిల్లా వైసీపీ మాజీ అధ్యక్షులు మర్రి రాజశేఖర్, డాక్టర్ మర్రి పెద్దయ్య, విద్యాసంస్థల అధినేత కె.బ్రహ్మయ్య, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేములపల్లి నరసయ్య, అయుబ్, బీజేపీ నాయకులు చిరుమామిళ్ల రాము, జనసేన పట్టణ అధ్యక్షులు జీవీఎస్ ప్రసాద్, పీడబ్ల్యూడీ వర్క్ షాప్స్, వర్కర్స్ యూనియన్ నాయకులు అమరలింగం, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ కాకుమారి పెద్ద పేరిరెడ్డి, పట్టణ సీపీఐ అధ్యక్షులు సత్యనారాయణ రాజు, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, బూదాల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు షేక్ బుడే, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు హెల్డా ఫ్లోరెన్స్, డాక్టర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలపై అసత్య ఆరోపణలు: మంత్రి బొత్స

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: జగనన్న కాలనీలపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. పవన్ కల్యాణ్ జనసేన ఒక రాజకీయ పార్టీ కాదనీ, అది కేవలం సెలబ్రిటీ పార్టీగానే తాను భావిస్తున్నానని ఎద్దేవా చేశారు. పవన్‌కే కాదు...కమెడియన్లకూ జనం వస్తారని పేర్కొన్నారు. క్రేన్లు పెట్టి లేపినా చంద్రబాబు లేవలేడనీ, దాని వల్ల పవన్‌కల్యాణ్‌కూ ఫలితం ఉండబోదన్నారు. ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలని నాడు దివంగత వైఎస్ఆర్ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారనీ, ఆయన ఒక ప్రణాళిక బద్ధంగా ఉమ్మడి రాష్ట్రంలో ఈ కార్యక్రమం చేశారని గుర్తుచేశారు. తండ్రి ఒక అడుగు ముందుకు వేస్తే తాను రెండడుగులు ముందుకు వేస్తూ ఆయన తనయుడు వైఎస్ జగన్ శాశ్వత ప్రాతిపదికన భారీ ఎత్తున పేదలందరికీ ఇళ్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టారని కొనియాడారు. ఎంత ఇబ్బంది ఉన్నా దీన్ని చేయాల్సిందేనని భావించి దాదాపు 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చామని, అందుకోసం 71,811ఎకరాల భూమిని సేకరించామని వివరించారు. వాటిలో ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయని, నిరుపేదల ఇళ్ల కోసం మొత్తం 25 వేల ఎకరాల భూమి కొనుగోలు చేశామని, అందు కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ఇప్పటి వరకు దాదాపు రూ.15 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

చలో రాజ్‌భవన్‌ను జయప్రదం చేయండి

కేవీవీ ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఈనెల 26న నిర్వహిస్తున్న చలో రాజ్‌భవన్‌ను జయప్రదం చేయాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఒంగోలు మల్లయ్యలింగం భవన్‌లో ప్రకాశం జిల్లా ఏపీ రైతు సంఘం జిల్లాస్థాయి విస్తృత సమావేశం సోమవారం జరిగింది. ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దేవెండ్ల శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ నవంబర్ 26న విజయవాడ ధర్నాచౌక్ వద్ద సభ నిర్వహిస్తామని, అనంతరం గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. రైతు నాయకులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందని ఆయన విమర్శించారు. పంటలకు మద్దతు ధర వచ్చే వరకు పోరాటం చేయాలన్నారు. భూసర్వేను రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.హనుమారెడ్డి మాట్లాడుతూ సుబాబుల్, జామాయిల్, సరుగుడుకు ఇస్తామన్న ఒప్పంద ధరను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెటింగ్ కమిటీల ద్వారా అమ్మకాలు, కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకాశం జిల్లాలో పేపర్ మిల్లు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రక్రియను విరమించుకోవాలన్నారు. రైతు సమస్యలపై నియోజకవర్గ కేంద్రాలలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కూనంనేని నాగార్జున, ఆంజనేయులు, బెల్లం వీరయ్య, బాణాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ ఏడీపై చర్యలు తీసుకోవాలి

ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్టీఆర్‌జిల్లా పశు సంవర్ధక శాఖ అదనపు సంచాలకులు(ఏడీ) తుమ్మల సాయి గోపాల్‌ను విధుల నుంచి బహిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తాడేపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా పశు సంవర్ధక శాఖలో ఏడిగా పనిచేస్తూ అధికార దుర్వినియోగం, అవినీతి చేస్తున్న అధికారిపై సమగ్ర విచారణకు ఆదేశించి విధుల నుంచి బహిష్కరించాలన్నారు. తుమ్మల సాయిగోపాల్, గన్నవరంలోని పశువుల గర్భదారణ విభాగం (స్పెర్మ్ బ్యాంకు)లో విధులు నిర్వహిస్తున్న మోనిష్‌తో కలిసి ఉమ్మడిగా మెడికల్ షాపులు, క్లినిక్‌లు నడుపుతున్నారని వివరించారు. పశుసంవర్ధక శాఖలో ఉద్యోగులైన మరి కొంతమంది డాక్టర్లు గోపాల మిత్రులతో కలిసి జిల్లాలో ఇలాంటి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఒక్కొక్క మెడికల్ షాపుకు రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెట్టుబడి పెట్టి తమ బినామీలతో వ్యాపారాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. విజయవాడ గొల్లపూడి, నందిగామ, గన్నవరం, నూజివీడు, ఏలూరు, గుడివాడ, ఉయ్యూరు, చల్లపల్లిలలో ప్రగతి ఏజెన్సీస్ పేర్లతో మందుల షాపులు నడుపుతున్నారని వివరించారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో స్థానిక పశుసంవర్ధక శాఖ అధికారులు, గోపాలమిత్ర సిబ్బందితో లాలూచీపడి శ్రీకృష్ణ ఎంటర్ ప్రైజెస్, ప్రగతి ఏజెన్సీల పేరుతో ఉమ్మడిగా వ్యాపారాలను బినామీ పేర్లతో నడిపిస్తున్నారన్నారు. విజయవాడ హనుమాన్ జంక్షన్లలో ప్రభుత్వ ఉద్యోగులైన డాక్టర్ల పేరు మీద మెడికల్ షాపులు నడిపిస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వం కేటాయించిన పశువుల మందులను 50శాతం వరకు సప్లయర్ల సహాయంతో అధికార దుర్వినియోగం చేస్తూ వారు నడుపుతున్నటు వంటి మెడికల్ షాపులకు క్లినిక్లకు ల్యాబ్‌లకు తరలించి 20 నుంచి 30శాతం రాయితీతో బిల్లులు లేకుండా మందులు విక్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రులలో విధులు నిర్వహించే వైద్యుల ద్వారా సూచించిన మెడికల్ షాపులోనే కొనుగోలు చేయాలని ప్రజలపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారుల దుర్వినియోగం, అవినీతిపై సమగ్రంగా విచారించి, చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అడ్డాడ మృతి తీరని లోటు: ఈడ్పుగంటి

విశాలాంధ్ర-చల్లపల్లి: ప్రజానాట్యమండలి కళాకారుడు, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు మృతి కమ్యూనిస్టు పార్టీకి, ప్రజానాట్యమండలికి తీరని లోటని విశాలాంధ్ర పూర్వ సంపాదకులు, సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ మాజీ చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపాన్ని ప్రకటించారు. ఉద్యమాలకే ఆయన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ప్రజానాట్యమండలిలో ఆయన పాత్ర కీలకమైనదని గుర్తుచేశారు.విప్లవ గేయాలతో, నాటకాలతో ప్రజలను చైతన్య పరుస్తూ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలకు వెన్నుదన్నుగా ఉన్న అడ్డాడ నాగేశ్వరరావు మృతి దివి తాలూకా కమ్యూనిస్టు పార్టీకి పూడ్చలేని లోటుగా ఆయన పేర్కొన్నారు.

రేపు సమాచార కమిషనర్ల ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్‌లో కొత్తగా నియమితులైన రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ ఆర్.మహబూబ్ బాషా, రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్ ఈ నెల 16వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం భవనం-1(మొదటి అంతస్తు)లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

ఎన్‌కౌంటర్ బూటకం... నిజనిర్ధారణ చేయాలి

లేఖ విడుదల చేసిన మావోయిస్టులు

విశాలాంధ్ర-ముంచింగిపూట్ (అల్లూరి జిల్లా): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని బైపరిగూడ బ్లాక్, బదిలిపార వద్ద ఈనెల 10వ తేదీన ఎస్ఓ పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని, ఇద్దరు సాధారణ కూలీలను పోలీసుల హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామంటూ మల్కన్‌గిరి-కొరపుట్ బోర్డర్ డివిజన్ కమిటీ కార్యదర్శి రాకేష్ పేరిట సోమవారం మావోయిస్టులు లేఖను విడుదల చేశారు. ఈ ఘటనపై తక్షణమే నిజనిర్ధారణ చేసి, దోషులను కఠినంగా శిక్షించాల్సిందిగా డిమాండ్ చేశారు.

ఈ అమానుష చర్యకు నిరసనగా ఈనెల 18వ తేదీన మల్కన్ గిరి, కొరాపుట్ జిల్లాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల10వ తేదీన భైపరిగూడ బ్లాక్ లో అటల్ గూడ, మాలిపాదర్, బదిలిపార గ్రామాల మధ్య అటవీ ప్రాంతానికి కూంబింగ్ కి వెళ్లిన ఎస్ఓజీ పోలీసులపై అర్ధరాత్రి మావోయిస్టులు కాల్పులు జరిపారని, ఆ తర్వాత పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారని, ఘటనా స్థలంలో మూడు కేఫ్ తుపాకులు, తూటాలు, మావోయిస్టుల దుస్తులు, సాహిత్యం, వంట పాత్రలు, గంజాయి మూటలు దొరికాయని ఫొటోలు, వీడియోలతో పోలీసు అధికారులు అబద్దపు ప్రకటనలు ఇచ్చారని లేఖలో పేర్కొన్నారు. పోలీసులు విడుదల చేసిన ఫొటోలు, వీడియోలు చూస్తే అది ఎంత బూటకమో ఎవరికైనా అర్థమవుతుందని తెలిపారు.

'లోన్ యాప్' వేధింపులపై ఫిర్యాదు చేయండి

డీజీపీ రాజేంద్ర నాథ్ రెడ్డి

విశాలాంధ్ర- విజయనగరం: లోన్ యాప్ నిర్వా హకులు వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఆత్మ హత్యలకు పాల్పడవద్దని రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్ర నాథ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. జిల్లాలో నమోదైన వివిధ కేసులపై పోలీస్ అధికారులతో సమీక్షించారు. అనంతరం డీజీపీ మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలను నిరోధించేందుకు తీసుకొచ్చిన దిశ యాప్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎక్కువ మహిళలు తమ మొబైల్స్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, రిజిస్ట్రేషను చేసుకొనే విధంగా చూస్తున్నామన్నారు. అవినీతిని నిర్మూలించేందుకు ప్రభుత్వం రూపొందించిన 14400 మొబైల్ యాప్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ యాప్ కు వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే 58 కేసులు నమోదు చేశామన్నారు. లోను యాప్‌ల మోసాలను నియంత్రించేందుకు పోలీసుశాఖ ప్రజల్లో అవగాహన కల్పిస్తోందన్నారు. లోన్ యాప్‌లపై ప్రజలు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని, రుణాలు తీసుకొనే ఆతృతతో వారు అడిగిన వాటన్నింటికి అనుమతులు ఇవ్వడం వల్ల మన ఫోటోలు, లొకేషను, కాంటాక్ట్ నంబర్లు తదితర డేటా అంతా వారి చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. ఇలా పొందిన డేటాతో వారు రుణగ్రహీతల ఫోటోలను మార్ఫింగ్ చేసి, బెదిరింపులకు పాల్పడుతూ, అధిక వడ్డీలతో రుణాలు వసూలు చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తూ, వేధింపులకు పాల్పడుతున్నా రన్నారు. బ్యాంకు అధికారులు కూడా అనధికార వ్యక్తులు బ్యాంకు ఖాతాలు తెరిచే సమయంలోను అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలు చేసే ఖాతాలపై నిఘా పెట్టాలన్నారు. రుణ యాప్‌ల వేధింపులు కారణంగా ఎవ్వరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, సకాలంలో ఫిర్యాదు చేస్తే, వారిపై చర్యలు చేపడతా మన్నారు. గంజాయి నిర్మూలనకు పోలీసుశాఖ సమర్థంగా చర్యలు చేపట్టిందని డీజీపీ తెలిపారు. మావోయిస్టు కార్యకలాపాలు ఏఓబిలో ఉన్నాయని, వారి చర్యలను నియంత్రిం చేందుకు ఎప్పటిలాగే పోలీసుశాఖ చర్యలు కొనసాగిస్తుందన్నారు. పోలీసు నియామకాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం కొన్ని అంశాలను పరిశీలిస్తోందని, త్వరలో దీనిపై ప్రభుత్వం ప్రకటన చేస్తుందని వెల్లడించారు.మీడియా సమా వేశంలో శాంతిభద్రతల విభాగం అదనపు డీజీ డా.రవిశంకర్ అయ్యన్నార్, విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్. హరికృష్ణ, జిల్లా ఎస్పీ ఎం.దీపిక పాటిల్ పాల్గొన్నారు.

ఆప్కాస్ చొరవ ప్రశంసనీయం

వైద్యారోగ్యశాఖ కమిషనర్ నివాస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యల పరిష్కారం కోసం ఏపీ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్స్ సర్వీసెస్ (ఆప్కాస్) చూపుతున్న చొరవ ప్రశంసనీయమని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జే.నివాస్ అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ కార్డులను ఆయన అందజేశారు. వైద్యారోగ్యశాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం ఏపీఐఐసీ భవనంలోని వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఆప్కాస్ నిర్వహించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన నివాస్ మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేం దుకుగాను ఆప్కాస్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సంబంధించిన ఈపీఎఫ్, ఈఎస్ఐ వారి సాంకేతిక పరమైన సమస్యలను ఆప్కాస్ సిబ్బంది అక్కడికక్కడే పరిష్కరించారని వివరించారు. కార్డుల ప్రాముఖ్యతను ఆప్కాస్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) బి.నాగప్రసాద్ ఉద్యోగులకు వివరించారు.

ఆంధ్రరత్నభవన్‌లో నెహ్రూ జయంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో పండిత జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, నాయకులు నూతలపాటి రవికాంత్, వి.గురునాథం, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఆందోళనకరమైన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వ్యాఖ్యలు

బలవంతంతో మత మార్పిడులు దేశ భద్రతకే ముప్పు తెస్తాయని, వీటివల్ల చాలా తీవ్రమైన పరిస్థితులు ఎదురవుతాయని, ఇలాంటి వాటిని ఆపడానికి కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి చర్యలు తీసుకోవాలని సాక్షాత్తు సుప్రీంకోర్టు తెలియజేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. బలవంతంగా మతం మార్పిడులు కొనసాగితే చాలా క్లిష్టమైన పరిస్థితులు ఎదురవుతాయని న్యాయమూర్తులు ఎం.ఆర్.షా, హిమ కోహ్లీతో కూడిన బెంచి వ్యాఖ్యానించింది. న్యాయమూర్తులు అక్కడితో ఆగలేదు. ప్రలోభాలకులోను చేసి మతంమార్పించే సంఘటనలను నివారించడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారో నివేదించాలని ఈ న్యాయమూర్తులు సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోరారు. బలవంతపు మత మార్పిడులవల్ల మత స్వేచ్ఛకు భంగం కలుగుతుందని, జనం చేతనకు విఘాతం కలుగుతుందని కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయదాఖలు చేసిన పిటిషన్‌ను విచారించే సందర్భంలో సుప్రీంకోర్టు ఈ హితవచనాలు పలకింది. "బెదిరించి, హెచ్చరించి, మోసగించి, కానుకలలాంటి ఎరలువేసి, ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయని నమ్మబలికి మతం మార్పించడాన్ని నిరోధించాలని కోరుతూ అశ్వినీ కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. అశ్వినీ కుమార్ కేవలం న్యాయవాది మాత్రమే కాదు. ఆయన బీజేపీకి గట్టి మద్దతు దారు. బీజేపీ భావజాలాన్ని వ్యాపింపచేయడానికి ఉపకరించే అంశాలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలుచేయడం ఆయన పనిగా పెట్టుకున్నారు. ఈ పిటిషన్ దాఖలు చేయడం వెనక ఉన్న ఉద్దేశాలను ప్రత్యేకంగా గమనిస్తేతప్ప అసలు విషయం బయట పడదు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి మతస్వేచ్ఛకు అవకాశం కల్పిస్తుంది. అయితే ఈ స్వేచ్ఛ పుట్టుకతోనే సంక్రమించదు. ఎందుకంటే ఈ దేశంలోపుట్టే ప్రతివ్యక్తి అనివార్యంగా ఏదో ఒక మతంలోనే పుడతాడు. పుట్టుకతోపాటే ప్రతి పౌరుడికి ఏదో ఒక మతంతో విడదీయరాని సంబంధం ఏర్పడుతోంది. సాధారణంగా తల్లిదండ్రులది ఏ మతమో వారి సంతానానిదీ అదే మతం అవుతుంది. ఒక వేళ తల్లిదండ్రులు భిన్న మతాలవారైతే వారి ఇంట్లో ఏ మత సంప్రదాయాలు కొనసాగుతాయో ఆ మతమే వారి సంతానానిది కూడా అవుతుంది. అప్పుడూ పుట్టుకవల్లే ఎవరిది ఏ మతమో నిర్ణయమై పోతోంది. మతస్వేచ్ఛ ప్రసాదించిన రాజ్యాంగమే మత మార్పిడికీ అవకాశం కల్పించింది. అయితే ఇది బలవంతంగా జరగకూడదు. అలా జరిగితే అది చట్టవిరుద్ధమైందిగానే లెక్క. మతమార్పిడులకు అనేక కారణాలు ఉండవచ్చు. తమకు పుట్టుకతో వచ్చిన మతంమీద విశ్వాసం సడలితే, మరో మతం అంతకన్నా మెరుగైంది అనిపిస్తే, లేదా ఆరాధనా పద్ధతుల విషయంలో వ్యక్తుల అభిప్రాయాలు సడలితే లేదా మారితే మతం మార్చుకోవడానికి అవకాశం ఉంది. డా.బి.ఆర్.అంబేద్కర్ మొదలు అలా మార్చుకున్న వారి ప్రముఖుల జాబితానే అనంతంగా ఉంది. ఒక మతంలోని ఆచారాలు, కట్టుబాట్లు నచ్చక మతం మారిన వారూ ఉంటారు. ఉన్నారు. కొన్నాళ్ల కిందటివరకు ఈ మతమార్పిడుల వివాదం కేరళలో ఎక్కువగా వినిపించేది. అదీ జనాన్ని బలవంతంగా క్రైస్తవ మతంలోకి మార్పిస్తున్నారన్న ఆరోపణలే ఎక్కువగా వినిపించేవి. ఈ మధ్య కాలంలో అనేక రాష్ట్రాలలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాత హిందువులను బలవంతంగా క్రైస్తవం, ఇస్లాం మతాల్లోకి మార్పిస్తున్నారన్న ఆరోపణలు మితిమీరాయి. లవ్ జిహాద్ లాంటి మాటలు సంఘపరివార్ అనుసరించే ముస్లిం వ్యతిరేక విధానాల నేపథ్యంలో చెలామణిలోకి వచ్చినవే. ఇతర మతాలనుంచి హిందూ మతంలోకి మారిన సందర్భాలు తక్కువే కావచ్చు. అయినా అలాంటివి ఉన్నప్పుడు చిన్న నిరసన స్వరం వినిపించిన దాఖలా కూడా లేదు. బీజేపీకి కేంద్రంలోనే కాక వివిధ రాష్ట్రాలలో అధికారం దక్కిన తరవాత ఒక వేపు ముస్లింల మీద విద్వేషం విరజిమ్మడం, మరో వేపు హిందూమతానికి ప్రమాదం ముంచుకొచ్చిందని నమ్మించే ప్రయత్నం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే బలవంతపు మత మార్పిడులు అన్న యాగీ మొదలైంది.

అశ్వినీ కుమార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడానికన్నా ముందే కనీసం 11 రాష్ట్రాలు బలవంతపు మతమార్పిడులను నిరోధించడానికి ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చాయి. ఇలాంటి మత మార్పిడులను శిక్షార్హమైన నేరంగా పరిగణించడం మొదలైంది. ఇలాంటి చట్టాలకూ సుదీర్ఘమైన చరిత్రే ఉంది. 1967లోనే ఒరిస్సాలో బలవంతపు మత మార్పిడుల చట్టం తీసుకొచ్చారు. ఇలాంటి చట్టాలలో అదే మొదటిది. మతాన్ని రాజకీయ ప్రయోజనాలకోసం వినియోగించుకోవడం బీజేపీ రంగం మీదకు వచ్చిన తరవాత మాత్రమే జరిగిన పరిణామం కాదు. హిమాచల్ ప్రదేశ్, ఒరిస్సా, అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటక, హర్యానాలో ఇలాంటి చట్టాలు ఇప్పటికే అమలులోకి వచ్చాయి. ప్రలోభ పెట్టి బలవంతంగా మతం మార్పిస్తే చట్ట రీత్యా శిక్షించడానికి జరిమానాలు, జైలు శిక్షలు ఈ చట్టాల ప్రకారం నిర్ధారణ అయిపోయాయి. ఈ జరిమానాలు రూ.5,000 నుంచి లక్ష రూపాయల దాకా ఒక్కో రాష్ట్రంలో ఒకోలా ఉన్నాయి. అలాగే జైలు శిక్షలు కూడా ఏడాది నుంచి అయిదేళ్ల దాకా ఉన్నాయి. ఈ చట్టాలు అమలులోకి రావడం అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ పిటిషన్‌ను విచారిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తుల దృష్టిలోకి రాలేదు అనుకోలేం. అయినా కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి బలవంతపు మత మార్పిడులను నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించడం న్యాయమూర్తుల వైఖరిలో భిన్నత్వం ఉంటుందని సరిపెట్టుకోదగిన విషయంగా మాత్రమే పరిగణించి ఊరుకోగలమా? న్యాయమూర్తుల భావజాలం ప్రమేయం ఇందులో లేశ మాత్రంగా కూడా లేదనిచెప్పే అవకాశమూ లేదు. ఈ ఇద్దరు న్యాయమూర్తులు వ్యక్తంచేసిన ఆందోళన కేసు విచారణ సంపూర్ణంగా మొదలుకాక ముందేనన్న విషయాన్ని ప్రత్యేకంగా గమనించాలి. అశ్వినీ కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేయడంలోని ఆంతర్యాన్ని న్యాయమూర్తులు గమనించ లేదని అనుకోవడానికీ వీలులేదు. ఈ వ్యాఖ్యలు చేయడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల దగ్గర బలవంతపు మత మార్పిడులకు సంబంధించిన గణాంకాలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించడం అనౌచిత్యం ఏమీకాదు. కేవలం పెళ్లికోసమే మతంమార్పిడి చెల్లదన్న అంశం వివిధరాష్ట్రాలు తీసుకొచ్చిన చట్టాలన్నింటిలో కనిపిస్తుంది. కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించాలన్న సూత్రం ఏమై పోయిందో తెలియదు. కులమత విభేదాలను రూపుమాపడానికి కులాంతర మతాంతర వివాహాలు తోడ్పడతాయని మొన్న మొన్నటిదాకా ప్రచారం అమాంతం మాయమైపోయినట్టుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ పరిశీలనలో లేని అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారేమోనన్న అనుమానం కలుగుతోంది. ఏ మతంతోనూ సంబంధం లేకుండా కూడా ఉండొచ్చునని రాజ్యాంగం చెప్పిన విషయాన్ని న్యాయమూర్తులు పరిగణించనట్టు లేదు.

విస్ఫోటనం దిశగా పట్టణ జనాభా!

ప్రపంచవ్యాప్తంగా 5 లక్షలకు పైగా జనాభా కలిగిన 990 పట్టణాల జనాభా విశ్లేషణ, జనసాంద్రత, భవిష్యత్తు పట్టణీకరణ అంచనాలు లాంటి ఆసక్తికర అంశాలతో కూడిన తాజా నివేదికను ఐరాస ఇటీవల విడుదల చేసింది. 'డెమోగ్రఫియా వరల్డ్ అర్బన్ ఏరియాస్-2022 (ప్రపంచ పట్టణ ప్రాంత జనాభా-2022)' పేరుతో వెలువరించిన నివేదిక ప్రకారం నేడు ప్రపంచ పట్టణ జనాభా దాదాపు 2.36 బిలియన్లు (236 కోట్లు) ఉందని, గత ఏడాది ప్రపంచ జనాభాలో 52 శాతం వరకు జనాభా పట్టణాల్లో జీవిస్తుండగా నేడు నగరాల జనాభా 57 శాతానికి పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా 10 మిలియన్ల జనాభా దాటిన 44 నగరాలను మెగాసిటీస్‌గా నామకరణం చేశారు. గతంలో 36 మెగాసిటీస్ ఉండగా నేడు 44 వరకు పెరిగాయి. చైనాకు చెందిన 11 నగరాలు, ఇండియాకు చెందిన 6 నగరాలు, బ్రెజిల్/జపాన్/పాకిస్థాన్/యూయస్ దేశాల్లో 2 చొప్పున మెగా సిటీస్ ఉన్నాయి. ఐదు మిలియన్లకు పైగా జనాభా కలిగిన 97 ప్రపంచ నగరాలను గుర్తించారు. అత్యధిక జనాభా కలిగిన 10 ప్రపంచ మెగాసిటీల జాబితాలో టోక్యో-యొకోహామా, జకార్తా, ఢిల్లీ, గ్వాంజావ్-ఫోషాన్, ముంబయ్, మనీలా, షాంఘై, సావ్‌పాలో, సియోల్, మెక్సికో ఉన్నాయి.

అత్యధిక జనాభా కలిగిన ప్రపంచ నగరాల జాబితాలో 3 వ స్థానంలో ఢిల్లీ, 5 వ స్థానంలో ముంబయ్ మహానగరాలతో పాటు 15 వ స్థానంలో కోల్‌కత, 23 వ స్థానంలో బెంగుళూరు, 33 వ స్థానంలో చెన్నై , 40 వ స్థానంలో హైదరాబాదు మహానగరాలు ఉన్నాయి. వీటితో పాటు పూణె (52వ స్థానం), అహ్మదాబాదు (53), సూరత్ (71), లక్నో (99) జైపూర్(111), కాన్పూర్(133), ఇండోర్(156), వారణాసి(161), నాగపూర్(164), పాట్నా (165), అలహాబాదు (169), ఆగ్రా(1191), చండీఘర్(22), భోపాల్(226), కొచ్చీ(227), తిరువనంతపురం(268), విశాఖపట్నం(235), వడోదరా(236), మీరట్(238), కోజీకోడ్(243), కోయంబత్తోర్(246), మధురై(247), నాసిక్(248), జంషెడ్‌పూర్(271), అలీఘడ్(282), రాంచీ(297), లుధియానా(300), ఔరంగాబాదు(302), జబల్‌పూర్(306), గ్వాలియర్(308), జోద్‌పూర్(309), కన్నూర్(317), బెరైలీ(323), రాజ్‌కోట్(325), గోరక్‌పూర్(328), రాయ్‌పూర్(329), విజయవాడ (331), అసన్‌సోల్(334), మైసూర్(337), తిరుప్పూర్(367), డెహ్రాడూన్(388), సహరన్‌పూర్(395), మలప్పురం(401), అమృత్ సర్(403), కోటా(411), గౌహతి(430), శ్రీనగర్(431), దుర్గ్-బిలాయ్‌నగర్(443), మొరాదాబాదు(448), తిరుచురాపల్లి(461), భువనేశ్వర్(464), ధన్‌బాదు(468), హుబ్లీ-దార్వాడ్(472), జలంధర్(473), కెల్లమ్(481), సోలాపూర్(490) పట్టణాలు తొలి 500 నగరాల జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన గుంటూరు(580వ స్థానం), వరంగల్(607), నెల్లూరు(674), తిరుపతి(762), కర్నూలు(785), రాజమండ్రి(912వ స్థానం) పట్టణాలు జాబితాలో చోటు చేసుకున్నాయి.

అభివృద్ధి చెందిన అధిక ఆదాయ దేశాల జనాభాతో పోల్చితే అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి దేశాల్లో పట్టణ జనాభా అధికంగా పెరుగుతుందని అంచనా వేశారు. 2100 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పట్టణ జనాభా రెట్టింపు అవుతుందని విశ్లేషించారు. 2100 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జనాభా 2.5 బిలియన్లు పెరిగి 106 శాతం వృద్ధిని చూపిస్తాయని వెల్లడించారు. పట్టణ జనాభా అమెరికా, యూరోప్ దేశాలు, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో 122 మిలియన్ల పట్టణ జనాభా తగ్గవచ్చని తెలుస్తున్నది. పల్లెను వదిలి పట్నం బాటను పట్టనున్న వలస బతుకులతో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు మసకబారి ఆహార అభద్రత రాజ్యమేలవచ్చు. నగరాల వెలుగుసల ఆకర్షణలతో పట్టణాల చుట్టు మురికి కూపాలు వెలుస్తున్నాయి. పని, పిల్లల చదువులు, చిరు వ్యాపారం, పండ్ల బండి, నిర్మాణ రంగం, పరిశ్రమల్లో కూలీలు, అసంఘటిత రంగ శ్రమలు, వీధి వ్యాపారాలు లాంటి కారణాలతో గ్రామీణ భారతం పట్టణాలకు పయనం అవుతున్నది. రాబోయే రోజుల్లో పల్లెలు అంతరిస్తూ పట్టణాల విస్తీర్ణం పెరగనున్నది. గ్రామ నగర సమతుల్యత దెబ్బతిన్నప్పుడు సుస్థిరాభివృద్ధి కుంటుపడి, సమాజంలో అశాంతి రెక్కలు విప్పవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

ధాన్యం సేకరణలో మద్దతు ధర మాయం

ఖరీఫ్ ధాన్యం మద్దతు ధరకు అక్టోబర్ 1నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో 39.35లక్షల ఎకరాల్లో వరి సాగైందని, 80లక్షల టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనావేసింది. ఇందులో 50లక్షల టన్నులు రైతుల నుంచి మద్దతు ధరకు సేకరిస్తామని, ధాన్య సేకరణకు 6,884 ఆర్‌బీకేలు ఏర్పాటు చేశామని వైసీపీ ప్రభుత్వం పేర్కొంది.

రైతుభరోసా కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని మిల్లుల సామర్థ్యంబట్టి మరపట్టడం, సీఎంఆర్ డెలివరీ కోసం రైస్ మిల్లులకు కేటాయించే బాధ్యతను మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల శాఖలకు ప్రభుత్వం బాధ్యత అప్పగించింది. బ్యాంక్ గ్యారంటీ సమర్పించిన రైసు మిల్లులకు సంబంధించిన సేకరణ ఏజన్సీతో ఎంవోయూ పొందడం ద్వారా నిర్ణీత గడువులోగా మిల్లులు బట్వాడా చేయాలని ఒప్పంద మార్గదర్శకాల్లో పేర్కొనడమైంది. ప్రభుత్వం ఖరారుచేసిన మద్దతుధర కంటే తక్కువ ధరకు ఎక్కడా కొనుగోళ్లు జరగగూడదని, అవకాశం ఉంటే ఎక్కువ ధరకు కొనుగోలు జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశం. గత సంవత్సరం కనీస గిట్టుబాటు ధరకోసం 3,200 కోట్లు కేటాయించగా, వివిధ పంటల కొనుగోళ్లకు మరో 11,500 కోట్లు ఖర్చు చేసినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 2022 అక్టోబర్ 1 కనీస మద్దతు ధరను ప్రకటించబోతున్నామని, అందుకోసం ధరల స్థిరీకరణ నిధి కోసం 3,300 కోట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రైతుల ఉత్పత్తులకు గ్రామాల్లో మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు జనతా బజార్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం రిలయన్స్, ఐటీసీ, పీ అండ్ జీ, హిందూస్థాన్ లివర్ వంటి సంస్థలను కూడా జనతా బజార్లలోకి తీసుకుని రావాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలు ఇచ్చారు.

వరిధాన్యం కొనుగోలుపై వైసీపీ ప్రభుత్వం చెబుతున్న మాటలు రైతులకు ధాన్యం అమ్ముకోవటంతో సమస్యలన్నీ తీరిపోయినట్లు, గిట్టుబాటు లభించి నట్లేననే భ్రమలు ప్రజల్లో కలుగుతాయి. ఇలాంటి ప్రచారం ప్రతి సంవత్సరం ధాన్యం కొనుగోలుకు ముందు ప్రభుత్వం చెబుతున్న మాటలే. కాని ఆచరణ లోనూ, రైతాంగ అనుభవంలోనూ అందుకు విరుద్ధంగా ఉంది. రైతాంగం ధాన్యం అమ్ముడుపోక, న్యాయమైనధర లభించక అనేక అవస్థలు పడుతున్నారు. మిల్లర్లు, బడావ్యాపారులు దోపిడీకి గురవుతున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతు ధాన్యం అమ్ముకోవాలంటే ముందుగా పంట నమోదు చేసుకోవాలి. ఇందుకు రైతాంగం అనేక అవస్థలు పడుతున్నారు. పంట నమోదు కాకపోతే రైతుభరోసా కేంద్రాల్లో రైతు పంట కొనుగోలు చేయరు. పంట నమోదు చేసుకున్నప్పటికీ నెలల తరబడి పంట విక్రయానికి రైతు ఎదురు చూడాల్సిన పరిస్థితి. రాజకీయ పలుకుబడిగల పెద్ద రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో, మార్కెట్ యార్డుల్లో పంటను అమ్ముకోగలుగుతున్నారు. పలుకుబడి లేని చిన్న, సన్న కారు రైతాంగం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. పంట విక్రయించిన 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావాలి.

ఆచరణలో నెలల తరబడి రైతుల ఖాతాల్లో డబ్బులు జమకావటం లేదు. ఫలితంగా చేసిన అప్పులు తీర్చటానికి, కుటుంబ అవసరాలకు డబ్బులు అందక రైతాంగం అనేక ఇబ్బందులు పడుతున్నారు.

మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం అందుకు అనేక నిబంధనలు పెట్టింది. ఆ నిబంధనలతో మట్టి, తాలు, తప్ప గింజ ఎక్కువగా ఉందని, రంగు మారిందని మద్దతు ధరలో కోత విధించి రైతులకు ఇచ్చే ధరను నిర్ణయిస్తున్నారు. పంట విక్రయానికి రైతులకు కావాల్సిన గోతాలు, రవాణ సౌకర్యాల గురించి పట్టించుకోకుండా వారిపైనే భారం మోపుతున్నది. అందువల్ల 75 కేజీల బస్తాకి రైతుకు లభిస్తున్నది 12వందల లోపే. మద్దతుధర ప్రకారం రూ.1515 రావాలి. రైతు భరోసా కేంద్రాల నుండి మిల్లులు వద్దకు వెళ్లిన ధాన్యం వల్ల రైతులు ఇంకా ఎక్కువగా నష్టపోతున్నారు. వివిధ వంకలు పెట్టి 5 కేజీలు అదనంగా కాజేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి ప్రజలపొట్ట నింపే రైతు పండించిన ధాన్యం అమ్మకంపై ఇన్ని ఆంక్షలు విధించే పాలకులు రైతుల ప్రయోజనాలే ముఖ్యమని చెప్పడాన్ని ఏమనాలి? వారి ప్రయోజనాలు ఎలా కాపాడతారు? మద్దతుధర పెంచాలని కేంద్రాన్ని కోరుతున్న జగన్మోహనరెడ్డి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయటం లేదు. మద్దతుధరపై అదనంగా ధరను ప్రకటించి రైతాంగాన్ని ఆదుకునే ప్రయత్నం ఎందుకు చేయటంలేదు. కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో రూ.200నుంచి రూ.500 వరకు అదనంగా ఇస్తున్నారు. అలా వైసీపీ ప్రభుత్వం ఎందుకు చేయటం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలు రైతుల ప్రయోజనాలను కాలరాస్తున్నాయి. అనేకపంటలకు మద్దతుధరలు, వ్యవసాయ ధరలు, వ్యయాల కమిషన్(సీఏసీపీ) కేంద్ర ప్రభుత్వానికి చేసిన సిఫార్సులు ఇలా ఉన్నాయి. వరి క్వింటాల్‌కు 4,513, జొన్నలకు 7,712, పెసలు 12,692, పత్తికి 15,890, కందులు 10,513, మొక్కజొన్న 2818, మినుములు 11,482 రూపాయలుగా ఉండాలని చెప్పింది. వ్యవసాయ కమిషన్ సిఫార్సులను కేంద్రం ప్రభుత్వం కనీసం పరిశీలనకు కూడా తీసుకోకుండా వరికి వంద రూపాయలను మాత్రమే పెంచింది. దీని ప్రకారం క్వింటాలు మేలురకం ధాన్యానికి 2060, సాధారణ రకానికి 2040 రూపాయలుగా ప్రకటించింది. మిగతా పంటలకు నామమాత్రంగా పెంచి చేతులు దులుపుకోవటం రైతాంగ వ్యతిరేక విధానాలకు నిదర్శనం. అన్ని పంట ఖర్చులను పరిగణలోకి తీసుకుంటే వరి ధాన్యానికి కనీసంగా మద్దతు ధర రూ.3,200 గా ప్రకటించాలి. మద్దతుధరకు పెద్ద రైతుల నుంచి పరిమితంగా కొనుగోలు చేసి చిన్న, మధ్య తరగతి రైతులనుంచి పూర్తిగా కొనుగోలు చేయాలని కూడా కేంద్రానికి కమీషన్ సిఫార్సు చేసింది. దీనిపై తన నిర్ణయాన్ని ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం తెలపలేదు. కమీషన్ సిఫార్సులను మోదీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని ఉంటే రైతాంగానికి ప్రయోజనం చేకూరేది.

రైతుల నుంచి ధాన్య సేకరణ కార్యక్రమం నుంచి మోదీ ప్రభుత్వం తప్పుకోవాలని యోచిస్తోంది. దాని ఫలితంగా ఫుడ్ కార్పొరేషన్ చేసే ధాన్యసేకరణ క్రమానుగతంగా తగ్గిపోతున్నది. కేంద్ర ప్రభుత్వం రైతుల నుంచి పండిన పంటలో 25శాతం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తాననటమే కారణంగా ఉంది. ధాన్య సేకరణ పూర్తిగా విరమించి ప్రైవేటు వ్యాపారుల నుంచి తనకు కావాల్సిన బియ్యాన్ని కొనుగోలు చేస్తానని చెప్పటం ద్వారా ధాన్య సేకరణ నుంచి కేంద్రం పూర్తిగా తప్పుకోనుంది. రాష్ట్రంలో పండిన పంటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సగం కూడా కొనుగోలు చేయటం లేదు. దీన్ని గమనిస్తే రైతాంగం ఎక్కువ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకోవాల్సి వస్తున్నది. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముందు ముందు ధాన్య సేకరణ నుంచి కేంద్ర ప్రభుత్వమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా తప్పుకునే విధానాలు అనుసరిస్తున్నది. అందులో భాగమే జనతా బజార్లలో పంటల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం రాష్ట్రంలోకి ప్రైవేట్ సంస్థలను తీసుకుని రావటం. ఫలితంగా రైతాంగం మిల్లర్ల దోపిడీతోపాటు బడా కంపెనీల దోపిడీకి గురై దారుణంగా నష్టపోతారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, డీజిల్ ధరలు పెరగటంతో రైతులకు సేద్యపు ఖర్చులు పెరుగుతూ ఉంటే అందుకు అనుగుణంగా పంటలకు న్యాయమైన ధరలు లభించక, మార్కెట్ సౌకర్యాలు లేక దళారుల, మిల్లర్ల దోపిడీకి గురౌతూ అప్పులపాలై వాటి నుంచి బయట పడలేక బలవన్మరణం పాలవుతున్నారు. ధాన్య సేకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలు అర్థంచేసుకుని, పండిన ధాన్యం మొత్తాన్ని ఎటువంటి నిబంధనలు లేకుండా నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయాలని, మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3,200 ప్రకటించాలని రైతాంగం ఉద్యమించాలి. ఉద్యమించకుండా సంక్షోభం నుండి బయటపడలేమని గ్రహించాలి.

బొల్లిముంత సాంబశివరావు, సెల్: 9885983526

ఇ-మెయిల్

రామ్‌దేవ్ బాబాను అరెస్టు చెయ్యాలి

అందరికి శకునం చెప్పే బల్లి కుడితిలో పడినట్లుగా, అందరికి తన మందులతో రోగం నయం చేస్తానని చెప్పే రామ్‌దేవ్ బాబా తన కంటికి జబ్బుచేస్తె సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్ళి బాగుచేయించు కుంటాడు. అంతేకాదు రామ్‌దేవ్ బాబా తయారుచేసే పతంజలి మందులు ఉపయోగిస్తే కంటిచూపు పోతుందని, చివరికి ప్రాణం కూడా పోవచ్చని కేరళకు చెందిన డాక్టరు బాబు ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి పిర్యాదుచేయగా ఉత్తరాఖండ్ ఆయుర్వేద యునాని సర్వీసెస్ కమిషన్ పతంజలి తయారుచేసే ఐదు రకాల మందులను నిషేధిస్తూ ప్రకటన చేసింది. ఈ ఉత్పత్తులను థైరాయిడ్, మధుమేహం, కొలెస్ట్రాల్ కొరకు పనిచేస్తాయని పతంజలి కంపెనీ ప్రకటించుకుంది. అయితే కేరళ డాక్టరు .బాబు ఫిర్యాదు చేసిన తరువాత ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఈ ఐదురకాల మందులను నిషేధించింది. గతంలోకూడా నేపాల్ ప్రభుత్వం పతంజలి మందులను నిషేధించింది.

ఇలాంటి దొంగమందులు తయారుచేసి, ప్రజల ప్రాణాలుతీసే పతంజలికి కేంద్రము కేటగిరి రక్షణ కల్పించింది. అంతేకాదు ఈయన తయారు చేసే ఫుడ్ ప్రొడక్ట్స్‌లో పురుగులు ఉన్నాయనికూడా కొన్ని రాష్ట్రప్రభుత్వాలు గతంలో ప్రకటించాయి. ఇలాంటి దొంగబాబాను, చీటింగ్ బాబాను ప్రధాని మోడీ బుజాన వేసుకరావటం సిగ్గుచేటు. ఈయనేకాదు ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమము నడుపుతున్న జగ్గీ వాసుదేవ్ బాబా, యమునానదిని కలుషితం చేసి పర్యావరణ పరిరక్షణ సంస్థకు వందకోట్లు రూపాయలు జరిమానా ఎగ్గొట్టిన పైజామా లాల్చీ ,గడ్డంతో వుండే ఒక బాబాను కూడా కేంద్రం వెనకేసుకొస్తుంది. తనవద్ద మహిమలున్నాయని , తాము ఇచ్చే మందులు వాడితే దీర్ఘరోగాలు మటుమాయం అవుతాయని, తాము యజ్ఞయాగాలు చేస్తే పిల్లలు పుడతారని చెప్పుకొనే ఇలాంటివారిని ది డ్రగ్స్ అండ్ మాజిక్ రెమెడీ ఆక్ట్ 1954 కింద అరెస్టు చెయ్యాలి. కనుక రామ్‌దేవ్ బాబాను పైన పేర్కొన్న యాక్ట్ కింద అరెస్టు చెయ్యాలి. అపుడే మిగతా వారికి బుద్ధి వస్తుంది.

-నార్నె వెంకటసుబ్బయ్య

సవాలు విసురుతున్న ఆహారభద్రత

అభివృద్ధి చెందుతోన్న దేశాలలో ఆహార భద్రత పెనుసవాలుగా పరిణమిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ప్రపంచ జనాభాకు సరిపడా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేస్తున్నాయి. సరఫరా, వినిమయం లోపాలు, వివిధ దేశాల ఆహారధాన్యాలపై ఆంక్షలు వలన అందరికీ ఆహారం అందించటంలో పెద్ద అగాధం ఏర్పడింది. "అంతర్జాతీయ ఫుడ్ పాలసీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐ.ఎఫ్.పి.ఆర్.ఐ)" నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 17శాతం ఆహార ధాన్యాల వ్యాపారానికి వివిధ ఆంక్షలు ఆటంకంగా ఏర్పడుతున్నాయి. తాజాగా రష్యా - ఉక్రెయిన్ యుద్ధంతో రష్యాపై యూరోపియన్ యూనియన్ దేశాలు ఆంక్షలు, అదేవిధంగా పామ్ ఆయిల్ విషయంలో ఇండోనేషియాపై, బీఫ్ విషయంలో అర్జెంటీనాపై ఆంక్షలు చూడవచ్చు. ఇటువంటి ఆంక్షలు వలన ఆహారపదార్థాల లభ్యతఉన్నా, వినియోగదారులకు అందుబాటులోకి లేక పోవడంతో సరఫరాగొలుసు (ఫుడ్ చైన్) దెబ్బతింటూ, ఆకలికేకలు, పోషకాహారలోపం వివిధ దేశాలను వెంటాడుతూనే ఉంది. ద్రవ్యోల్బణం, ధరలు పెరుగుదలతో సామాన్యప్రజల జీవితాలు దుర్భరం అవుతున్నాయి. ఆహార ద్రవ్యోల్బణం పడగవిప్పి నాట్యం చేస్తోంది. ఇటువంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, "గ్రెయిన్ డీల్" లో భాగంగా ఐక్యరాజ్యసమితి రష్యా ఆహార ధాన్యాల ఎగుమతులు, దిగుమతులపై సడలింపు ఇచ్చింది. అయితే పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ముఖ్యంగా యూరోపియన్ దేశాలు రష్యా నుంచి ఆహార ధాన్యాలు, ఎరువులు దిగుమతి చేసుకోవడం లేదు. దీంతో రష్యా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ తన ఆహార ధాన్యాల ఎగుమతులు, ఎరువులు, పాలిమర్ ఉత్పత్తులు ఆసియా దేశాలకు ఎగుమతి చేస్తూ ఆర్థికంగా తాను అభివృద్ధి చెందడంతోపాటు, ఆహార భద్రతకు భరోసా ఇస్తుంది. "ఐక్యరాజ్యసమితి ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సంస్థ" నివేదిక ప్రకారం గత ఆగస్టు నాటికి, ఆహార ద్రవ్యోల్బణం 130 పాయింట్లు పెరిగింది. దీన్ని సాధ్యమైనంత త్వరగా తగ్గించుకోవాలి.

రసాయన ఉత్పత్తులు కూడా ఆహార భద్రతలో కీలక పాత్ర పోషిస్తాయి. ఫాస్ఫరస్, నైట్రోజన్, పొటాష్ వంటివి పంట దిగుబడిని పెంచేందుకు సహకరిస్తాయి. ఫుడ్ కెమిస్ట్రీ, పెట్రో కెమికల్ పరిశ్రమలు కూడా ఆహార పదార్థాలు నిల్వ ఉంచడంలో ఆహార వస్తువుల ప్యాకింగ్ ద్వారా వృధాను అరికట్టేందుకు వీలవుతుంది. గ్రెయిన్ డీల్ ద్వారా రష్యా ఎరువులను కూడా

ఎగుమతి చేయవచ్చు. కానీ అలా జరగడంలేదు. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్ దేశాలు ఆంక్షలు విధించాయి. వాస్తవం చెప్పాలంటే, సుమారు 15శాతం ఎరువులు రష్యా నుంచే లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తూ ఉంటారు. దీంతో అనేక దేశాల్లో రైతులు పంట దిగుబడి పెంచుతూ ఆహార భద్రతకు భరోసా ఇస్తున్నారు. ప్రస్తుతం ఆంక్షల నేపథ్యంలో రష్యా తన ఎరువులను ఆసియా దేశాలకు ఎగుమతి చేస్తూ ఈ ప్రాంతంలో పంట దిగుబడిని పెంచేందుకు, ఆహార పదార్థాలు అధిక ఉత్పత్తికి చేయూత నిస్తుంది. మనదేశంలోనూ రైతులు ఎరువులు అధికంగా వాడుట వలన అధిక ఉత్పత్తి సాధిస్తున్నారు. ఈరోజున రష్యా ఎరువులు 8 రెట్లు ఎక్కువగా వాడుతున్నారు. ఫాస్ఫేట్ ఎరువులో భారత్‌కు రష్యా అతిపెద్ద ఎగుమతిదారు.

ఇక ఆహార భద్రతలో " ప్యాకేజింగ్" ప్రముఖ పాత్ర పోషిస్తుంది. కొన్ని నివేదికల ప్రకారం ఆహార ధాన్యాల సరఫరా కాలంలో సుమారు 20శాతం తినకుండా పాడేసే ఆహారం 25శాతం వృధా అవుతోంది. వివిధ రకాల పాలిమర్స్ ప్యాకేజింగ్‌లో కీలక పాత్ర పోషిస్తాయి. పంటలను నిల్వ ఉంచడంలో, వినిమయంలో ముఖ్య పాత్ర వహిస్తుంది. ఎఫ్.ఎ.ఓ అంచనా ప్రకారం ప్రతీ సంవత్సరం 400 బిలియన్ల అమెరికన్ డాలర్లు విలువచేసే ఆహారం వృధా అవుతోంది. 4.4 గిగాటన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ఉత్పత్తి అవుతుంది. అనగా చైనా, అమెరికా తరువాత అంతటి కాలుష్యం కార్బన్ డై ఆక్సైడ్ ఈ ఆహార వృధా వల్ల జరుగుతోందన్నారు. ఆహార పదార్థాలను నిల్వ ఉంచడం, వృధాను అరికట్టేందుకు పాలిమర్ ప్యాకేజీ ఎంతో తోడ్పడుతుంది. ఈ పాలిమర్ ఉత్పత్తులు ఉత్పత్తి చేయడంలోనూ రష్యాలోని" సిబర్" కంపెనీ ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద కంపెనీ. రష్యా నుంచి ఎగుమతి అయ్యే పాలిమర్ ఉత్పత్తులు పైనా, ఈయూ దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో రష్యా ఈ ఉత్పత్తులను కూడా ఆసియా దేశాలకు ఎగుమతి చేస్తూ, ఆహార భద్రత విషయంలో తోడ్పాటు అందిస్తుంది. యూరప్ దేశాలకు 42శాతం పాలిమర్ ఉత్పత్తులు రష్యా నుంచే ఎగుమతి అవుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో యూరప్ దేశాలకు ఎగుమతి అయ్యే అవకాశాలు లేకపోవడంతో, రష్యా మనలాంటి దేశాలకు ఎగుమతి చేస్తుంది. ముఖ్యంగా పాలిమర్ ఉత్పత్తులకు భారతదేశంలో చాలా పెద్ద మార్కెట్ ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ ఒక్కరూ సంవత్సరానికి సగటున 28 కేజీల పాలిమర్ ఉత్పత్తులు వాడుతూ ఉంటే, మనదేశంలో మాత్రం 9.7 కేజీలు మాత్రమే వాడుతున్నారు. అదే చైనాలో అయితే, 45 కేజీల పాలిమర్ ఉత్పత్తులు వాడుతూ ప్రపంచంలో మొదటి స్థానంలో ఉన్నారు. అయితే ప్లాస్టిక్ వినియోగం మంచిది కాదు. రష్యా కంపెనీ సిబర్ తాను తయారుచేసే పాలిమర్ ఉత్పత్తులు

పునరుత్పత్తికి అనుకూలంగా (పి.ఇ.టి) గ్రాన్యూల్స్‌తో తయారు చేస్తుంది. ఈ గ్రాన్యూల్స్‌లో 30శాతం తిరిగి రిసైక్లింగ్ చేయవచ్చు. ఇటీవల 2021లో దావోస్‌లో జరిగిన "వరల్డ్ ఎకనామిక్ ఫోరం" లో "నెట్ జీరో" ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడానికి వివిధ రకాల ఒప్పందాలు కుదుర్చుకొన్నారు. ఆపత్కాలంలో కూడా నాటో, ఈయూ, యూరప్ దేశాలు అనేక రకమైన ఆంక్షలు రష్యా ఉత్పత్తులుపై విధించినా దేనికీ భయపడని విధంగా, సమయోచితంగా, తన ఆహార ధాన్యాలను, ఎరువులను, చమురును, పాలిమర్ ఉత్పత్తులను ఆసియా దేశాలకు ఎగుమతి చేస్తూ తాను ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ, అనేక దేశాల్లో ఆహార కొరత రాకుండా, ఫుడ్ చైన్ సరఫరాలో అంతరాలు తలెత్తకుండా, ఆహార భద్రతకు భరోసా ఇస్తూ రష్యా ముందుకు సాగుతోంది.

-ఐ.ప్రసాదరావు, 6305682733

కాంగ్రెస్‌లో టికెట్ల రగడ

- గుజరాత్‌లో ఆందోళనకు దిగిన యూత్ కాంగ్రెస్
- పార్టీ కార్యాలయంపై కార్యకర్తల దాడి

అహ్మదాబాద్: గుజరాత్‌లో కాంగ్రెస్ నాయకుల మధ్య టికెట్ల రగడ కొనసాగుతోంది. డబ్బు తీసుకొని తమ అనుయాయులకు టికెట్లు ఇప్పించుకుంటున్నారని యువజన కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. ప్రత్యేకించి గుజరాత్‌లోని జమల్పూర్-ఖేడియా అసెంబ్లీ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే ఇమ్రాన్ ఖేదవాలాకు ఇవ్వడాన్ని మరో వర్గం తప్పుపట్టింది. ఆగ్రహంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంపై సోమవారం దాడికి దిగింది. ఖేదవాలాకు టికెట్ ఇవ్వాలన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ సీనియర్ నాయకుడు భరత్‌సిన్హ సోలంకి పోస్టర్లను పార్టీ కార్యకర్తలు దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోలంకి నామఫలకాన్ని ధ్వంసం చేశారు. ఆయనను దూషిస్తూ గోడలపై అసభ్యపదజాలంతో రాతలు రాశారు. ఖేదవాలా నుంచి డబ్బు తీసుకొని కాంగ్రెస్ యువజన నాయకుడు షహనావాజ్ షేక్‌ను విస్మరించారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఖేదవాలాపై స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు తీవ్రవ్యతిరేకంగా ఉన్నప్పటికీ తమ కుటుంబ ఆస్తిగా పార్టీని నడిపే కొంతమంది నాయకులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఇష్టానుసారం టికెట్లు పంపిణీ చేస్తున్నారని ఓ కార్యకర్త విమర్శించారు. ఖేదవాలాకు టికెట్ ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. షేక్ వంటి నిబద్ధత గల నాయకులకు టికెట్లు ఇవ్వకుండా డబ్బు తీసుకొని ఖేదవాలా వంటి నేతలకు ఇస్తున్నారని మరో కార్యకర్త విమర్శించారు. ఈ సీటును బీజేపీకి కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అందరూ శాంతియుతంగా ఉండాలని, పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పార్థీవ్‌రాజ్ కత్వాడియా కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. మీ అభ్యర్థనను పార్టీ నాయకత్వం వింటుందని, సరైన పరిష్కారం చూపుతుందని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. జమల్పూర్ సీటు నుంచి ఎంఐఎం ఓ మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సబీర్ కబ్లీవాలాను రంగంలో దించింది. బీజేపీ టికెట్‌పై మాజీ ఎమ్మెల్యే భూషణ్ భట్ పోటీ చేస్తున్నారు. భట్ 2012లో ఇక్కడి నుంచి గెలిచి...2017లో ఓటమి చెందారు.

నేటి స్వప్నం...రేపటి వాస్తవం

బాలలకు రాష్ట్రపతి హితబోధ

న్యూఢిల్లీ: 'పెద్ద పెద్ద కలలు కనండి...భారత్ అభివృద్ధికి తోడ్పాటు అందించండి' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విద్యార్థులకు పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతిని పరిరక్షించాలని, తల్లిదండ్రులను గౌరవించాలని, మాతృభూమిని ప్రేమించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్(ఆర్‌బీసీసీ)లో వివిధ పాఠశాల విద్యార్థులతో రాష్ట్రపతి సోమవారం మాటామంతి పంచుకున్నారు. బాల్యమనేది జీవితంలో ఓ అందమైన దశ అని ముర్ము పేర్కొన్నారు. ప్రతి నూతనతరం సరికొత్త అవకాశాలు, కొత్త కలలతో ముందుకు వస్తున్నదని ఆమె చెప్పారు. 'ఇది సాంకేతిక పరిజ్ఞానం, సమాచార విప్లవ యుగం. స్వదేశీ, సామాజిక, పర్యావరణ అంశాల గురించి బాలలు బాగా అర్థం చేసుకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానం, విజ్ఞానం, సమాచారం ఇప్పుడు పిల్లలకు బాగా అందుబాటులో ఉంటుంది. వీటిలో ఏది అడిగినే వెంటనే చెప్పగల సామర్థ్యం వారిలో కనిపిస్తోంది' అని రాష్ట్రపతి అన్నారు. బాలలకు సరైన విలువలు బోధించడానికి మనం కృషి చేయాలని, వారిని అనేక కార్యకలాపాలు, చర్చల్లో భాగస్వాములను చేయాలని, మనం కూడా పిల్లల నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉందని ఆమె తెలిపారు. నేటి మన స్వప్నం రేపటి వాస్తవంగా మారుతుందని హితబోధ చేశారు.

నెహ్రూ ఆశయాలు ఆచరణీయం

ఖర్గే, సోనియా, రాహుల్ తదితరుల నివాళి

న్యూఢిల్లీ: భారతదేశపు ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూకు కాంగ్రెస్ పార్టీ సోమవారం ఘన నివాళి అర్పించింది. నెహ్రూ అద్భుతమైన, దార్శనికత లేకుండా 21వ శతాబ్దపు భారతదేశాన్ని ఊహించలేమని పేర్కొంది. 2014 తర్వాత ఆయన ఆలోచనలు, విధానాలకు ప్రాధాన్యత పెరిగిందని స్పష్టంచేసింది. ఢిల్లీలోని నెహ్రూ స్మారకస్థూపం శాంతివన్ వద్ద కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులు పుష్పగుచ్ఛాలతో నివాళి అర్పించారు. ట్విట్టర్ వేదికగా రాహుల్‌గాంధీ శ్రద్ధాంజలి ఘటించారు. 'పండిట్ నెహ్రూ ప్రజాస్వామిక, ప్రగతిశీల, లౌకిక విలువలు నా హృదయంలో పదిలంగా నిలిచాయి. మదర్ ఇండియా రక్షణ కోసం నేను నడుస్తున్నాను' అని తన భారత్ జోడో యాత్రనుద్దేశించి రాహుల్ పేర్కొన్నారు. 'స్వేచ్ఛాయుత గొప్ప భారతదేశాన్ని మనం నిర్మించాలని నెహ్రూ చెప్పిన మాటలను ఉటంకిస్తూ ప్రియాంకగాంధీ ఆయనకు నివాళి అర్పించారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో నెహ్రూ చిత్రపటం వద్ద సీనియర్ నేత శశిథరూర్ శ్రద్ధాంజలి ఘటించారు. నెహ్రూకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు తెలిపారు.

భారత్ జోడో యాత్ర పునఃప్రారంభం

ముంబై: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర 68వ రోజుకు చేరుకుంది. ఒకరోజు విరామం తర్వాత సోమవారం మహారాష్ట్రలోని హింగోలి జిల్లా కలమ్‌నూరి నుంచి తిరిగి ప్రారంభమైంది. వాషిమ్ వరకు కొనసాగింది. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా సోమవారం యాత్రలో పాల్గొన్న వారికి నెహ్రూ రాసిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' పుస్తకం 600 కాపీలను పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ ఈ సందర్భంగా తెలిపారు. సెప్టెంబర్ 7న తమిళనాడులోని కన్యాకుమారి నుంచి ప్రారంభమైన భారత్ జోడో యాత్ర ఇప్పటి వరకు ఆరు రాష్ట్రాల్లోని 28 జిల్లాల్లో కొనసాగింది. నవంబర్ 20న మధ్యప్రదేశ్‌లో ప్రవేశించడానికి ముందు మహారాష్ట్రలోని ఐదు జిల్లాల మీదుగా 382 కి.మీ. యాత్ర కొనసాగుతుంది.

19 నెలల కనిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: ఇంధనం, తయారీ వస్తువుల ధరలు తగ్గిన నేపథ్యంలో టోకు ద్రవ్యోల్బణం 19 నెలల కనిష్ఠానికి దిగొచ్చింది. టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం అక్టోబరులో డబ్ల్యూపీఐ సూచీ 8.39 శాతంగా నమోదైంది. ఇంధనం, తయారీ వస్తువుల ధరలు దిగిరావడమే ఇందుకు దోహదం చేసింది. దాదాపు 18 నెలల తర్వాత టోకు ద్రవ్యోల్బణం రెండంకెల దిగువకు చేరింది. 2021 మార్చిలో నమోదైన 7.89 శాతమే చివరిది. ఖనిజ చమురు, ప్రాథమిక లోహాలు, లోహ ఉత్పత్తులు, వస్త్రాలు, ఖనిజాల ధరలు తగ్గడం ద్రవ్యోల్బణం దిగిరావడానికి కారణమైనట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ తెలిపింది. సెప్టెంబరులో 11.03 శాతంగా ఉన్న ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 8.03 శాతానికి తగ్గింది. కూరగాయల్లో 39.66 శాతం నుంచి 17.61 శాతానికి ద్రవ్యోల్బణం తగ్గింది. ఇంధనం-విద్యుత్ ద్రవ్యోల్బణం 23.17 శాతానికి, తయారీ వస్తువుల ద్రవ్యోల్బణం 4.42 శాతానికి దిగొచ్చింది.

భవిష్యత్ తరాల అభ్యున్నతికి నిరంతర చర్యలు

పినరయి విజయన్

తిరువనంతపురం: భవిష్యత్తు తరాలను మరింత పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన వారిగా తీర్చిదిద్దేందుకు వామపక్ష ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం బాలల దినోత్సవం సందర్భంగా అన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా సోమవారం విజయన్ సోషల్ మీడియా పోస్ట్‌లో మాట్లాడుతూ... పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వ కార్యకలాపాలు, పథకాలను సమన్వయం చేయడానికి మహిళా, శిశు అభివృద్ధిశాఖ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లలకు పౌష్ఠికాహారం అందించే లక్ష్యంతో చేపట్టిన పథకాల్లో 'పోషకబాల్యం' పథకం కూడా ఒకటని చెప్పారు. అంతేకాకుండా, రాష్ట్రంలో స్మార్ట్ అంగన్‌వాడీల అమలు, అనాథల ఆర్థిక సహాయం కోసం రూ. 3.2 కోట్లు మంజూరు, కేరళలోని అన్ని పంచాయతీలలో క్లినిక్‌ల ఏర్పాటు వామపక్ష ప్రభుత్వం తీసుకున్న ఇతర ప్రధాన సానుకూల చర్యలు అని పోస్ట్‌లో తెలిపారు. బాలల సంక్షేమం ద్వారానే భారతదేశం సామాజిక ప్రగతిని సాధిస్తుందని నెహ్రూ కూడా విశ్వసించారని ముఖ్యమంత్రి అన్నారు. అందువల్ల, శిశు సంక్షేమంలో కేరళ సాధించిన విజయాలు నెహ్రూ ఆలోచనల సాక్షాత్కారమని ఆయన అన్నారు. భారత్ లౌకిక ప్రజాస్వామ్య దేశంగా ఉండాలని నెహ్రూ కూడా కోరుకున్నారని విజయన్ అన్నారు. బాలల సంక్షేమానికి భరోసాతో పాటు ఆయన నిలబెట్టిన ప్రజాస్వామ్య, లౌకిక సూత్రాలను కూడా మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

డింపుల్ నామినేషన్ దాఖలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి లోక్‌సభ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నిక కోసం సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ) అభ్యర్థిగా మాజీ ఎంపీ, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ (44) సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అఖిలేష్ యాదవ్‌తో కలిసి వెళ్లి ఆమె నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె తన మామ, సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకులు ములాయంసింగ్ యాదవ్‌ను గుర్తుచేసుకున్నారు. నేతాజీ (ములాయం) ఆశీర్వాదాలు తమకు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ములాయం సింగ్ యాదవ్ గత నెల 10న మరణించడంతో మెయిన్‌పురి లోక్‌సభ స్థానం ఖాళీ అయ్యింది. దాంతో ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ తన సతీమణి డింపుల్ యాదవ్‌ను అక్కడి నుంచి బరిలో దించారు. అధికార బీజేపీ తన అభ్యర్థిని ఇంకా ఖరారు చేయలేదు. కాంగ్రెస్, బీఎస్పీ, శివలాల్ యాదవ్‌కు చెందిన ప్రగతిశీల్ సమాజ్‌వాది లోహియా పార్టీ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నాయా.. లేదా..? అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. డింపుల్ 2012లో కన్నౌజ్ పార్లమెంట్ స్థానానికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కన్నౌజ్ ఎంపీగా ఉన్న అఖిలేష్ యాదవ్ ముఖ్యమంత్రి కావడంతో లోక్‌సభ స్థానానికి రాజీనామా చేసి డింపుల్‌ను అక్కడి నుంచి బరిలో దించారు. 2019లో బీజేపీ అభ్యర్థి సుబ్రత్ పాథక్ చేతిలో డింపుల్ యాదవ్ ఓడిపోయారు. ములాయం మరణంతో ఇప్పుడు ఆమెకు మళ్లీ పార్లమెంటులో అడుగుపెట్టేందుకు మార్గం ఏర్పడింది. మెయిన్‌పురి పార్లమెంట్ స్థానానికి డిసెంబర్ 5న పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ క్రమంలో ఇవాళ మొదలైన నామినేషన్ ప్రక్రియ గడువు ఈ నెల 17తో ముగియనుంది.

యువతిని ముక్కలుగా నరికి... ఢిల్లీ అంతటా విసిరేసిన క్రూరుడు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో దారుణం చోటు చేసుకున్నది. పెళ్లిచేసుకోవాలని ఒత్తిడి తీసుకువచ్చిన తనతో సహజీవనం చేస్తున్న యువతిని ఒక వ్యక్తి దారుణంగా హతమార్చాడు. అనంతరం ఆమెను ముక్కలుగా కోసి ఢిల్లీ అంతటా విసిరేశాడు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడిని అఫ్తాబ్ అమీన్ పూనావాలాగా పోలీసులు గుర్తించారు. ఐదు నెలల క్రితం ఈ ఘటన జరగ్గా చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అఫ్తాబ్ అమీన్, 26 ఏళ్ల శ్రద్ధ గత కొన్నాళ్లుగా సహజీవనం చేస్తున్నారు. తనను పెళ్లిచేసుకోవాలని అఫ్తాబ్‌పై శ్రద్ధ ఒత్తిడి చేస్తూ వస్తున్నది. ఈ విషయమై ఇద్దరూ తరచుగా గొడవ పడుతుండేవారు. మే 18న మరోసారి జరిగిన వాగ్వాదం తీవ్రస్థాయికి చేరుకున్నది. కోపోద్రిక్తుడైన అఫ్తాబ్ గొంతు కోసి శ్రద్ధను చంపాడు. అనంతరం పదునైన ఆయుధంతో ఆమె శరీరాన్ని ముక్కలు చేశాడు. చాలా రోజుల పాటు ఢిల్లీలోని వివిధ ప్రదేశాల్లో తిరుగుతూ ఆమె శరీరం ముక్కలను పారవేశాడు.

బాధితురాలి తండ్రి వికాస్ మదన్ నవంబర్ 8న ఢిల్లీలోని మెహ్రౌలీ పోలీస్ స్టేషన్‌లో తన కుమార్తె కిడ్నాప్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముంబైలోని ఓ కాల్ సెంటర్‌లో పనిచేసిన సమయంలో అక్కడ ఆమెకు అఫ్తాబ్‌తో స్నేహం ఏర్పడిందని తండ్రి తన ఫిర్యాదులో తెలిపారు. ఆమె కుటుంబీకులు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ చివరికి అఫ్తాబ్‌తో ఢిల్లీ వెళ్లి సహజీవనం చేసింది. ఢిల్లీలోని ఛతర్‌పూర్ ప్రాంతంలో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. 2022 మే నెల తరువాత తమ కుమార్తె నుంచి ఎలాంటి సమాచారం తమకు అందలేదని, తమను ఆమె సంప్రదించలేదని తండ్రి వికాస్ చెప్పాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని అఫ్తాబ్ అమీన్ పూనావాలాను విచారిస్తున్నారు.

మాకు ఆత్మగౌరవమే ముఖ్యం

మమతా బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ బీజేపీ నేతల తీరుపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జి ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం నబన్నాలో మీడియాతో మమత మాట్లాడుతూ,బీజేపీ నేతలు అనే పదాన్ని ఉచ్చరించకుండా.. 'కొంత మంది పశ్చిమబెంగాల్‌లోనే ఉంటున్నారు. ఇక్కడే తింటున్నారు. పైగా బెంగాల్‌కు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారు. బెంగాల్‌కు ఢిల్లీ (కేంద్ర సర్కారు) డబ్బులివ్వదని మాట్లాడుతున్నారు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.అయినా తనకు ఢిల్లీ నుంచి వచ్చే డబ్బులు అవసరం లేదని మమతాబెనర్జి వ్యాఖ్యానించారు. బెంగాల్‌కు తన కాళ్లపై తాను నిలబడే సామర్థ్యం ఉన్నదని చెప్పారు. తమ ఆత్మగౌరవమే తమకు ముఖ్యమని, దాన్ని ఎట్టిపరిస్థితుల్లో ఢిల్లీ చేతుల్లోకి వెళ్లనివ్వమని మమత స్పష్టంచేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును తాను క్షమాపణ కోరుతున్నానని తెలిపారు. 'రాష్ట్రపతి చాలా మంచి మహిళ. అఖిల్‌గిరి చేసింది తప్పు. నేను క్షమాపణ కోరుతున్నా. మా ఎమ్మెల్యే తరఫున నేను క్షమాపణ కోరుతున్నా. ఐయామ్ సారీ' అని చెప్పారు. ఈస్ట్ మిడ్నాపూర్‌లోని రామ్‌నగర్‌కు చెందిన ఎమ్మెల్యే, బెంగాల్ జైళ్ల శాఖ మంత్రి అఖిల్‌గిరి గత శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురించి అవమానకర వ్యాఖ్యలు చేశారు. నందిగ్రామ్‌లో బెంగాల్ బీజేఎల్పీ నేత సువేందు అధికారిపై విమర్శలు చేస్తూ అఖిల్‌గిరి నోరు జారారు. అఖిల్‌గిరి వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో ఆయన రాష్ట్రపతికి క్షమాపణలు చెప్పారు. తాజాగా నబన్నాలో ప్రెస్‌మీట్ పెట్టి మరీ మమతాబెనర్జి కూడా రాష్ట్రపతికి క్షమాపణలు తెలిపారు. మా పార్టీలో ఎవరైనా పొరపాటు చేస్తే తాము వ్యతిరేకిస్తామని చెప్పారు. అలాంటి వాటిని తాము సహించమని మమత అన్నారు.

22 ఏళ్లుగా ఇంటికి దూరం

- ఉత్తరాఖండ్‌లో అపరిష్కృత సమస్యగా వలసలు
- మెరుగైన జీవనం కోసమే నగరాలకు 1.18 లక్షల మంది
- ఆర్‌డీఎంపీసీ వైస్ చైర్‌పర్సన్ నేగి

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌ను వలసల సమస్య 22 ఏళ్లుగా వెంటాడుతోంది. ఈనెల 9న రాష్ట్ర 22వ అవతరణ దినోత్సవం జరిగింది. సరైన ఉపాధి, విద్య, ఆరోగ్య మౌలిక వసతులు లేక స్థానికులు వలసబాట పట్టక తప్పడం లేదు. ఉత్తరాఖండ్ గ్రామాల నుంచి 1.18 లక్షల మంది నగరాలు/పట్టణాలకు తరలిపోయారు. పౌరి, అల్మోరా జిల్లాలపై వలసల ప్రభావం ఎక్కువగా ఉంది. కోవిడ్ లాక్‌డౌన్ వేళ స్వస్థలానికి తిరిగి వచ్చిన వారిలో 5-10 శాతం మంది మాత్రమే ఉండిపోగా మిగతా వారంతా పొట్టచేత పట్టుకొని మెరుగైన ఉపాధి, జీవనం కోసం వలస వెళ్లారని గ్రామీణాభివృద్ధి, వలసల నివారణ కమిషన్ (ఆర్‌డీఎంపీసీ) వైస్ చైర్‌పర్సన్ ఎస్ఎస్ నేగి తెలిపారు. మెరుగైన ఉపాధి, ఉద్యోగం, విద్య, ఆరోగ్య వసతుల కోసం రాష్ట్రం నుంచి 1,702 మందికిపైగా నగరాలకు తరలిపోయారన్నారు. అడవి జంతువుల బెడద, వాటి వల్ల పంటలకు నష్టం కలిగి దిగుబడి తగ్గి ఆదాయం లేకపోవడం వంటి కారణాలతో వలసలు పెరిగాయన్నారు. గిరి గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి నెలకు రూ.10 వేలు సంపాదన ఉంటే వలసలు ఆగిపోతాయని నేగి అన్నారు. గ్రామాలపై దృష్టిపెట్టి అక్కడ మెరుగైన విద్య, ఆరోగ్య వసతులు కల్పిస్తే ఇల్లు, వాకిళ్లు వదిలి వేరొక ప్రాంతానికి తరలిపోవాల్సిన అవసరం ఉండదన్నారు. గతంలో ముంబై, ఢిల్లీ వంటి నగరాలకు రాష్ట్ర ప్రజలు వెళ్లేవారుగానీ ఇటీవల కాలంలో గ్రామాల నుంచి పక్క పట్టణాలు, నగరాలకు వెళుతున్నారని చెప్పారు. ఒకే జిల్లాలో వలసలు చోటుచేసుకుంటున్నట్లు హరిద్వార్ జిల్లా పర్యటనలో తెలిసిందని, వేరొక రాష్ట్రానికి కాకుండా జిల్లాలోని కోట్వార్, శ్రీనగర్ లేక సత్పులి పట్టణాలకు ప్రజలు వెళుతున్నట్లు నేగి చెప్పారు. తమ మూలాలను మర్చిపోకుండా ఉండటమే కాకుండా మెరుగైన ఉపాధి పొందేందుకు ఈ వలసలు దోహదమవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికీ వలసలు కొనసాగుతున్నప్పటికీ గతంలో వలే దీన పరిస్థితులు లేవని, సరవేగంగా మార్పు వస్తోందన్నారు. లాక్‌డౌన్ తర్వాత సొంతూళ్లలో ఉండిపోయిన వారికి పని, గౌరవప్రద జీవితాన్ని ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దసవాల్‌గా మారిందని చెప్పారు. పర్యాటక రంగానికి ఊతమివ్వడం వల్ల ఉపాధి అవకాశాలు పెరిగి వలసలు తగ్గుతాయని నేటి అన్నారు. అన్ని వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన రోడ్డు ప్రాజెక్టు చివరి దశకు చేరుకుంటుండటంతో రాబోయే సంవత్సరాల్లో పర్యాటకం మెరుగవుతుందని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి స్వయం యోజ్‌గార్, పౌల్ట్రీ, డెయిరీ, హార్టికల్చర్ రంగాలకు సులభతర రుణాలు వంటివి మరింత ఉపయుక్తంగా పరిణమిస్తాయని నేగి అన్నారు.

ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది

న్యూఢిల్లీ: ప్రసారభారతి ముఖ్య కార్యనిర్వాహక అధికారి(సీఈఓ)గా సీనియర్ ఐఏఎస్ అధికారి గౌరవ్ ద్వివేది నియమితులయ్యారు. ఆయన ఛత్తీస్‌గఢ్ కేడర్‌కు చెందిన 1995 బ్యాచ్ అధికారి. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన ఐదేళ్లు ఈ పదవిలో కొనసాగుతారు. ద్వివేది ఇంతకుముందు మై గవ్ ఇండియా సీఈఓగా పనిచేశారు. ప్రస్తుత ప్రసార భారతి సీఈఓ శశిశేఖర్ వెంపటి 2017 నుంచి 2022 వరకు పనిచేశారు. వెంపటి ఐదేళ్ల పదవీకాలం పూర్తి కావడంతో ఈ ఏడాది జూన్ నుంచి ప్రసారభారతి ఇన్‌చార్జి సీఈఓగా దూరదర్శన్ డైరెక్టర్ జనరల్ మయాంక అగర్వాల్ బాధ్యతలు చేపట్టారు.

ఈడీ విచారణకు డీకే శివకుమార్

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టరేట్(ఈడీ) ఎదుట సోమవారం హాజరయ్యారు. శివకుమార్‌ను ఈడీ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఈ కేసులో ఈడీ ఎదుట శివకుమార్ హాజరు కావడం ఇది రెండోసారి. అనంతరం శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ విచారణకు సంబంధించి తనను కోరిన పత్రాలన్నింటినీ ఈడీకి సమర్పించానని చెప్పారు. ఈ కేసులో తాను రెండోసారి వాంగ్మూలం ఇచ్చానన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఇప్పటికే కాంగ్రెస్ అధినేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పవన్ బన్సాల్ వంటి అనేకమందిని ఈడీ ప్రశ్నించింది.

హీరో కార్తీ ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్

చెన్నై: ప్రముఖ తమిళ నటుడు కార్తీ ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్ అయింది. దీని పునరుద్ధరణ కోసం ఫేస్‌బుక్ బృందంతో సంప్రదింపులు జరిపినట్లు స్వయంగా కార్తి చెప్పారు. కార్తీ తమిళంతో పాటు తెలుగులోను చిరపరిచితుడు. ఆయన తమిళ సినిమాలు అనేకం తెలుగులో డబ్బింగ్ చేశారు. పరుతివీరన్, పైయా, నాన్ మహాన్ అల్లా, సిరుత్తై, కైతి వంటి అనేక సూపర్ హిట్ చిత్రాలలో కార్తీ నటించారు. మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన గొప్ప ప్రజాదరణ గల పొన్నియన్ సెల్వం-1లో ఆయన నటించారు. ఆయనతో పాటు విక్రమ్, జయం రవి, త్రిష కృష్ణన్, ఐశ్వర్యారాయ్ నటించారు.

ఎమ్మెల్యేగా ఆరుసార్లు గెలుపు...

ప్రస్తుతం బీజేపీ రెబల్‌గా పోటీ

అహ్మదాబాద్: ఎమ్మెల్యేగా ఆరుసార్లు గెలిచిన నేత ప్రస్తుతం బీజేపీ తిరుగుబాటు అభ్యర్థిగా గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. వాఘోడియా నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే మధుభాయ్ శ్రీవాస్తవ్‌కు ఈ ఎన్నికలలో పోటీచేసేందుకు బీజేపీ టికెట్ నిరాకరించింది. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని ఆయన నిర్ణయించారు. 1995లో ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన తాను అప్పటి బీజేపీ రాష్ట్ర నేతలైన మోదీ, అమిత్ షా కోరడంతోనే ఆ పార్టీలో చేరినట్లు శ్రీవాస్తవ్ తెలిపారు. ఆ తరువాత బీజేపీ తరుపున ఐదుసార్లు పోటీ చేసి గెలిచిన తనకు ఈసారి టికెట్ ఇవ్వలేదని విమర్శించారు. తన స్థానంలో టికెట్ పొందిన వడోదర జిల్లా బీజేపీ చీఫ్ అశ్విన్ పటేల్, స్థానిక ఎన్నికల్లో ఎన్నడూ గెలవలేదని తెలిపారు. తనకు టికెట్ నిరాకరించడంపై బీజేపీపై తాను చాలా కోపంగా ఉన్నానని, ఆ పార్టీలో అన్ని పదవులను వదులుకుంటున్నానని మీడియాకు చెప్పారు. 1995లో తాను భారీ మెజార్టీతో స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలువడంతో నరేంద్ర మోదీ, అమిత్ షా తన వద్దకు వచ్చి బీజేపీలో చేరమని కోరారని చెప్పారు. అందుకే తాను బీజేపీలో చేరినట్లు వెల్లడించారు. మోదీ, అమిత్ షాతో నేరుగా మాట్లాడే అవకాశం ఉన్నప్పటికీ తనకు టికెట్ నిరాకరించినందుకు వారితో మాట్లాడబోనని అన్నారు.

వలసదారులను నిర్బంధించండి: అమిత్‌షా

న్యూఢిల్లీ: వలసదారుల పేరిట మైనారిటీలపై అణచివేతలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రతి రాష్ట్రంలో అక్రమ వలసదారులను గుర్తించి, నిర్బంధించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశించారు. వారిని దేశం నుంచి వెళ్లగొట్టాలని ఉన్నతస్థాయి ఇంటెలిజెన్స్ అధికారులను ఆదేశించారు. పొరుగు దేశాలు వారిని అనుమతించకపోయినా వలసదారులను తరిమికొట్టాలని పేర్కొన్నట్లు మీడియా తెలిపింది. అన్ని రాష్ట్రాల సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరోస్ (ఎస్ఐబీ)తో ఈ నెల 9న నిర్వహించిన సమావేశంలో అధికారులకు విధిగా లక్ష్యాలను నిర్దేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రతి రాష్ట్రంలోనూ దాదాపు 100కు పైగా చొరబాటుదారులను గుర్తించాలని, వారి పత్రాలను తనిఖీ చేయాలని, అవసరమైతే అరెస్టులు చేయాలని ఆదేశించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. పంజాబ్‌లో సిక్కులు క్రైస్తవ మతంలోకి మారిన ఘటనలను ప్రస్తావిస్తూ క్రిస్టియన్ మత మార్పిడి ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించినట్లు సమాచారం. ఉత్తరప్రదేశ్, బీహార్ సరిహద్దు జిల్లాల్లో ముస్లిం జనాభా పెరుగుదలపై ఐబీ (ఇంటెలిజెన్స్ బ్యూరో) ఇచ్చిన సమాధానంపై షా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మీడియా తెలిపింది. దేశంలో వలసదారులు, చొరబాటుదారులను అడ్డుకోవాలంటూ షా లక్ష్యాలను నిర్దేశించడం ఇదే మొదటిసారికాదు. చొరబాటుదారులను గుర్తించి, ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని 2018లో ఎన్డీయే ప్రభుత్వం ఆదేశించింది. షా ఆదేశాల మేరకు 2019 అస్సాంలో 19 లక్షల మంది పౌరులను జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్నార్సీ) నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. ఇదే విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నార్సీ అనేది చట్టబద్ధమైన భారతీయ పౌరులుగా ఉన్న వారి అధికారిక రికార్డు. ఈ జాబితాను అస్సోం ప్రభుత్వం నిర్వహిస్తోంది.

మహారాష్ట్ర రాజకీయాలు కలుషితం: రౌత్



ముంబై: మనుషులు ఒకరి నొకను అంతం చేసుకునేలా మహారాష్ట్రంలో రాజకీయాలు కలుషితమయ్యాయని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 9న జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ విషయం తనకు మళ్లీ అర్థమైందని రౌత్ చెప్పారు. రౌత్ ఈ ఏడాది ఆగస్టు 1న మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేయగా, నవంబర్ 9న ముంబైలోని కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రౌత్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని సేనకు చెందిన పత్రిక 'సామ్నా'లో తన వారపు కాలమ్ రోఖ్‌ఠోక్‌ను తిరిగి ప్రారంభించారు. మహారాష్ట్రలో ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి ప్రభుత్వం ఈ ఏడాది జూన్‌లో సేన నాయకుడు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని తిరుగుబాటు కారణంగా కూలిపోయింది, తరువాత అతను బీజేపీ మద్దతుతో ముఖ్యమంత్రి అయ్యాడు. 'ద్వేషపూరిత భావన ఉంది. రాజకీయ నాయకులు ఇప్పుడు తమ ప్రత్యర్థులు సజీవంగా ఉండకూడదనుకునే స్థాయికి చేరుకున్నారు. మహారాష్ట్ర రాజకీయ వాతావరణం కలుషితమైంది, అక్కడ ప్రజలు ఒకరినొకరు నాశనం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు'అని రౌత్ పేర్కొన్నారు. 'రాజకీయాల్లో చేదుకు ముగింపు పలకాలని దేవేంద్ర ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్య గురించి నన్ను అడిగినప్పుడు, అతను నిజం మాట్లాడుతున్నాడని నేను బదులిచ్చాను. మీడియా నేను తగ్గించానని చెప్పడం ప్రారంభించింది' అని రౌత్ అన్నారు. 'ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ఇప్పుడు లేవు. ఇప్పుడివి పేర్లు మాత్రమే. రాజకీయాలు విషతుల్యంగా మారాయి. బ్రిటీష్ హయాంలో అలా ఉండేది కాదు' అని రౌత్ పేర్కొన్నారు. ఢిల్లీలోని నేటి పాలకులు తమ కోరికను వినాలన్నారు. అలా చేయని వారిని శత్రువులుగా పరిగణిస్తారని ఆయన పేర్కొన్నారు. 'చైనా, పాకిస్తాన్‌లు ఢిల్లీకి శత్రువులు కావు. అయితే నిజం మాట్లాడేవారిని, సూటిగా మాట్లాడేవారిని శత్రువులుగా పరిగణిస్తారు. అలాంటి రాజకీయ నాయకులు దేశ స్థాయిని దిగజార్చుతారు" అని రౌత్ అన్నారు.

నవరత్నాల్లో 'కోనేరు కమిటీ' సిఫార్సులు

- పక్కా ఇళ్లు ప్రభుత్వమే నిర్మించాలి
- పేదల స్వాధీన ఇళ్ల స్థలాలు, సాగు భూములకు పట్టాలివ్వాలి
- డిసెంబరు మూడో వారంలో రాష్ట్రస్థాయి భూపోరాట సదస్సు
- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను నవరత్నాల్లో చేర్చి భూ పంపిణీని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో పక్కా ఇళ్లను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, లేకుంటే ఐదు లక్షల రూపాయలు లబ్ధిదారులకు ప్రభుత్వమే అందజేయాలని కోరింది. విజయవాడ దాసరిభవన్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుల సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు. వామపక్షాల ఒత్తిడి ఫలితంగా 2006లో అప్పటి కాంగ్రెస్ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరుడు కోనేరు రంగారావు నేతృత్వంలో మంత్రులు, అధికారులు, అనధికారులతో భూ కమిటీ వేసిందని, ఆ కమిటీ సిఫార్సుల అమలుకు చర్యలు తీసుకుందని, భూ యజ్ఞం పేరుతో 5.60 లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేసినట్లు సమావేశం గుర్తుచేసింది. ఆ భూ కమిటీ రెండేళ్లపాటు సుదీర్ఘ సమయం తీసుకుని ప్రాంతాల భూ స్వభావాన్ని, కష్టజీవుల స్థితిగతులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను సమర్పించిందని, మొత్తం 12 విభాగాలుగా చేసి 104 ప్రతిపాదనలు చేసిందని తెలిపింది. ఇందులో కొన్ని మాత్రమే వివాదాస్పద అంశాలున్నప్పటికీ...పేదలకు ముఖ్యంగా పేద రైతులకు, దళితులకు, గిరిజనులకు ఉపయోగపడే వివిధ సానుకూల ప్రతిపాదనలు ఆ కమిటీలో ఉన్నాయని తెలిపింది. నివేదిక మొదటి కాపీని ఆనాటి ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణకు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిన తనకు అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అందజేశారని గుర్తుచేసింది. కోనేరు రంగారావు కమిటి సిఫార్సుల అమలులో భాగంగా, తన తండ్రి వైఎస్ ఆశించిన విధంగా సీఎం జగన్...భూ పంపిణీని నవరత్నాల్లో చేర్చి పేదలకు భూములు పంపిణీ చేయాలని, దీనిద్వారా వైఎస్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సమావేశం సూచించింది.

పేదలకు భూ పంపిణీ చేయాలి: రామకృష్ణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రసంగిస్తూ ప్రభుత్వ భూములు పడావుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్షలాది ఎకరాల భూములు అన్యాక్రాంత మవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ప్రభుత్వ భూములు గుర్తించి పేదలకు పంచకపోతే ఎర్రజెండాలతో భూముల్లోకి వెళ్లాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వానికి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో పక్కా ఇళ్లను ప్రభుత్వమే ఉచితంగా నిర్మించి ఇవ్వాలని లేదా లబ్ధిదారులకు రూ.5లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు పూర్తయినప్పటికీ పేదలకు పంపిణీ చేయడంలో ప్రభుత్వ అలసత్వమేమిటో అర్థం కావడం లేదన్నారు.

పక్కా ఇళ్ల నిర్మాణానికి కృషి: జల్లి విల్సన్, అవుల శేఖర్

జల్లి విల్సన్, అవుల శేఖర్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో తక్షణమే పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల కాలనీల్లో ఎంతవరకు పక్కా ఇళ్లు నిర్మా ణమయ్యాయో, ఆయా ప్రాంతాలను జిల్లా నాయకత్వాలు పరిశీలించి కాలనీలు పూర్తయి ఉంటే మౌలిక సదుపాయాల కల్పన మెరుగుదలకు, పక్కా ఇల్లు పూర్తికాక అర్ధాంతరంగా ఆగి ఉంటే తక్షణమే పరిపూర్తి చేయాలని కోరుతూ పర్యటనలు కొనసాగించాలని కోరారు. సాగు భూముల అంశాన్ని నవరత్నాల్లో చేర్చి కోనేరు రంగారావు భూకమిటీ ప్రతిపాదనల మేరకు భూమిలేని ప్రతి కష్టజీవికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

తీర్మానాలు: భూములను, పేదలను గుర్తించి ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 3వ వారంలో రాష్ట్రస్థాయి భూపోరాట సదస్సు విజయవాడలో నిర్వహిం చాలని సమావేశం తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకత్వాలు అన్ని జిల్లాల్లో గ్రామ సంఘాలు నిర్మించాలని, ఐదు లక్షల సభ్యత్వం చేర్పాలని, జిల్లాల పునర్విభజన జరిగినందున తక్షణమే జిల్లా కమిటీలు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే పేదల స్వాధీనంలో ఉన్న ఇళ్ల స్థలాలు, సాగు భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని సమావేశం తీర్మానించింది.

కష్టజీవుల వలసలు ఆపాలి

జల్లి విల్సన్, అవుల శేఖర్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పనులు లేక నానా ఇబ్బందులకు గురవుతున్న కష్టజీవులు చేసేదేమీ లేక, బతుకు జీవుడా అంటూ గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వలసలు వెళు తున్నారనీ, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వలసలు నివారణకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవుల శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతంలోని ముఖ్యంగా కర్నూలు జిల్లాలో పడమర తాలూకాలో ఇప్పటికే గ్రామాలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. అధిక వర్షాల కారణంగా వేసిన పంట చేతికి రాక దిక్కు తోచని పరిస్థితిలో రైతులు ఉండగా, కూలీలు కూడా పనులు లేక పస్తులు ఉండాల్సి వస్తోందని వివరించారు. బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకువెళ్లి తమ కుటుం బాలను పోషిం చుకుందామని వలసలు వెళ్తున్న పేదలను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శిం చారు. ఏటా నవంబరులో అధిక మొత్తంలో కూలీలు వలసలు పోతున్న సమాచారం అధికారులకు తెలిసిన ప్పటికీ, ఉపాధి హామీ పనులు మొదలు పెట్టకపోవడం అధికారుల అలసత్వా నికి నిదర్శనమన్నారు. ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించి వలసలు ఆపేందుకు ఆయా జిల్లా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. వాటిని ఆపకుంటే ఇంకా పెరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు వలసలను నివారిం చాలని, లేకుంటే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని విల్సన్, శేఖర్ హెచ్చరించారు.

16 వేల మందికి పంటల బీమా దూరం

రైతులకు అన్యాయం దుర్మార్గం: సీఎం జగన్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకాన్ని సక్రమంగా అమలుచేయాలని, పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు సోమవారం ఆయన ఒక లేఖ రాస్తూ 2021లో పంట నష్టపోయిన 15.60లక్షల మంది రైతులకు ఈ ఏడాది జూన్ 14న రూ.2,977.82 కోట్లు పరిహారంగా విడుదల చేశారని తెలిపారు. అందులో 16 వేల మందికి పరిహారం అందలేదని గుర్తుచేశారు. ఒకే గ్రామంలో పక్కపక్క పొలాలు గల రైతుల్లోనే చాలామందికి పరిహారం అందలేదు. వారిని అనుమానిత ఖాతాల కింద ప్రభుత్వం చేర్చింది. ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించని కారణంగా బీమా ఇవ్వలేమని చెబుతూ రైతుల నోట్లో మట్టి కొట్టడం దుర్మార్గం. బీమా రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని గతేడాది ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులకు చెప్పడంతో వారు రైతు భరోసా కేంద్రాల చుట్టూ తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. అయినా దరఖాస్తులిచ్చిన లక్షల మందికి పరిహారం రాలేదు. కనీసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో, ఎంత పరిహారం ఇవ్వాల్సి ఉంటుందో కూడా వివరాలను వ్యవసాయ శాఖ తెలపకపోవడం విచారకరం. 2020-21, 2021-22 ఖరీఫ్ సీజన్‌కు మాత్రమే బీమా లెక్క కట్టిందని, రబీ పంట నష్టాన్ని కనీసం ప్రకటించలేదని రామకృష్ణ లేఖలో పేర్కొన్నారు. రబీ రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అప్పులు తెచ్చి పంటలు వేసిన రైతులు పంటలు పోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకాన్ని సక్రమంగా అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు ఓటువేస్తే వృథానే: కేజ్రీవాల్

అహ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీకి ఓటేయడం ద్వారా మీ ఓటు హక్కును వృథా చేసుకోవద్దని గుజరాత్ ప్రజలకు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు బదులుగా ఆప్‌కు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. పాలక బీజేపీతో పోటీ పడే సత్తా ఆప్‌కే ఉందని చెప్పారు. అహ్మదాబాద్‌లో కేజ్రీవాల్ సోమవారం విలేకరుతో మాట్లాడుతూ గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 4-5 సీట్లు మాత్రమే వస్తాయన్నారు. 27 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉందని, ఇంతకాలంగా బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కాంగ్రెస్‌కు బలం లేదని ప్రచారం చేయడం ద్వారా బీజేపీకి తామే అసలైన ప్రత్యర్థులమని ఆప్ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తోంది. మొత్తం 182 సీట్లకుగాను ఆప్ ఇప్పటికే 178 మంది అభ్యర్థులను ప్రకటించి...ప్రచారంలో దూసుకుపోతోంది. 'కాంగ్రెస్‌కు లభించే ఓట్ల శాతం కేవలం 13 శాతమే. దానికి 4-5 సీట్లు మాత్రమే లభిస్తాయి. రాష్ట్రంలో బీజేపీ, ఆప్ మధ్యే ప్రధాన పోటీ' అని కేజ్రీవాల్ చెప్పారు. తమ ఓట్లను వృథా చేసుకోవద్దని కరుడుగట్టిన కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయన విజ్ఞప్తి చేశారు. మీ కుటుంబం, మీ పిల్లల భవిష్యత్ కోసం ఆప్‌కు ఓటేయాలని కోరారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ కాంగ్రెస్ పూర్తిగా బలాన్ని కోల్పోతోందని చెప్పారు. కాంగ్రెస్‌కు ఎవరూ ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో రెండు రకాల ఓటర్లు ఉన్నారని, అందులో ఒకరు బీజేపీని పూర్తిగా ద్వేషించే వారని చెప్పారు. వారంతా 27 ఏళ్ల బీజేపీ దుష్టపాలనపై అసహనంతో ఉన్నారన్నారు. వారంతా బీజేపీకి దూరంగా ఉంటారని చెప్పారు. మరికొంతమంది బీజేపీ పట్ల నిస్సహాయత ఉందని, కానీ వారంతా కాంగ్రెస్‌ను పూర్తిగా ద్వేషిస్తున్నారని, వారంతా నిస్సహాయ స్థితిలో బీజేపీకి ఓట్లేస్తున్నారని వివరించారు. రెండోరకం ఓటర్లు ఆప్‌కు ఓటేస్తారని, ఆదే సమయంలో కాంగ్రెస్ ఓట్లు ఆప్‌కు బదిలీ అవుతాయన్నారు.

ట్విట్టర్‌లో మరో 4400 మంది తొలగింపు

శాన్ ఫ్రాన్సిస్కో: ఖర్చులను తగ్గించుకునే క్రమంలో ట్విట్టర్ కొత్త యజమాని ఎలాన్ మస్క్ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. తాజాగా ఔట్‌సోర్సింగ్ విభాగంలో పెద్ద ఎత్తున లేఆఫ్‌లు ప్రకటించినట్లు తెలుస్తోంది. ఈ సంస్థను తన చేతుల్లోకి తీసుకున్న వారానికే ట్విట్టర్‌లో దాదాపు సగం మంది ఉద్యోగులకు మస్క్ ఉద్వాసన పలికిన విషయం తెలిసిందే. తాజాగా ఔట్‌సోర్సింగ్ విభాగంలోనూ కోతలు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ విభాగంలో 5500 మంది కాంట్రాక్టు ఉద్యోగు లుండగా వీరిలో 4400 మందిని ట్విట్టర్ తొలగించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. వీరికి ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే ఇంటికి పంపించినట్లు తెలిసింది. కంపెనీ ఇ-మెయిల్, ఇంటర్నల్ కమ్యూనికేషన్ సిస్టమ్స్‌తో ఉద్యోగులు యాక్సెస్ కోల్పోయిన తర్వాతే తాము లేఆఫ్‌లకు గురైనట్లు వారికి తెలిసింది. అమెరికా సహా ఇతర దేశాల్లోని ట్విటర్ ఆఫీసుల్లో ఈ లేఆఫ్‌లు ఉన్నట్లు కథనాలు తెలిపాయి. ట్విటర్‌కు చెందిన కంటెంట్ మాడరేషన్, రియల్ ఎస్టేట్, మార్కెటింగ్, ఇంజినీరింగ్, ఇతర విభాగాల్లోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తీసేశారు. వీరిని తొలగించినట్లు కాంట్రా క్టర్లకు ఇ-మెయిల్ ద్వారా సమాచారమిచ్చారు. తాజా కోతలపై ట్విటర్ నుంచి గానీ, ఎలాన్ మస్క్ నుంచి గానీ అధికారిక ప్రకటనేదీ రాలేదు.

సహకార రంగం ధ్వంసానికి కుట్ర

మోదీ సర్కారుపై విజయన్ ఆగ్రహం

పలక్కాడ్: మోదీ సర్కారుపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం విరుచుకుపడ్డారు. దేశంలో సహకార రంగాన్ని ధ్వంసం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. దేశంలో వందేళ్ల చరిత్ర గల సహకార రంగం ప్రజల జీవితాల్లో కీలక భూమిక నిర్వహించిందని విజయన్ పేర్కొన్నారు. అఖిలభారత సహకార రంగం వారోత్సవాలను ప్రారంభించిన విజయన్...ఈ రంగం ప్రాముఖ్యతను వివరించారు. సహకారరంగంలో తీసుకొస్తున్న మార్పులపై పౌర సమాజం చర్చించాల్సిన అవసరం ఉందని సూచించారు. మోదీ సర్కారు సహకార రంగంలో తీసుకొస్తున్న మార్పులపై రాష్ట్ర ప్రభుత్వం అనేక అభ్యంతరాలు లేవనెత్తిందని ఆయన గుర్తుచేశారు.

'సహకార రంగంపై రాష్ట్ర ప్రభుత్వాలదే పూర్తి అధికారమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ విధానానికి ఇది చెంపపెట్టు. పెద్దనోట్ల రద్దు ద్వారా సహకార రంగాన్ని ధ్వంసం చేసే ప్రయత్నాలను మేము తిప్పికొట్టాం' అని విజయన్ చెప్పారు. దేశంలోని రాజ్యాంగ సంస్థల ధ్వంసానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అలాంటి సంస్థలను ఉపయోగించుకొని సహకార రంగంపై దాడి చేయిస్తోందని విమర్శించారు. 'కొత్త కొత్త ఆదేశాల ద్వారా సహకార రంగంలో జోక్యం చేసుకోవడానికి కేంద్రం ప్రయత్నిస్తోంది. మనది సమాఖ్య దేశమైనప్పటికీ మన సమాఖ్య చట్టా లను ఉల్లంఘిస్తూ అనేక విషయాల్లో కేంద్రం జోక్యం చేసుకుంటుంది' అని ఆయన మండిపడ్డారు. గడచిన మూడు దశాబ్దాలుగా ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, కానీ కానీ సహకారరంగం బలోపేతానికి చర్యలు తీసుకోవడం ద్వారా కేరళలో తక్కువ ద్రవ్యోల్బణం ఉండేలా లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. సహకార రంగం, ఆర్థిక సంస్థలు కుదేలైనప్పటికీ పెద్దనోట్ల రద్దు నుంచి తమను తాము కాపాడుకున్నామని విజయన్ వివరించారు.

వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య పథకం పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీజేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరూ ఆరోగ్య పథకానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వావిలపాడు ఎడ్లకు ప్రథమ స్థానం

విశాలాంధ్ర-వేపాడ: విజయనగరం జిల్లా వేపాడ మండలం వావిలపాడు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు గండి వెంకటరావు ఎడ్లు ప్రథమ స్థానం దక్కించుకున్నాయి. ఇందుకుగాను రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనం, సీల్డు సొంతం చేసుకున్నాయి. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశేలు గ్రామంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందేలను ఆదివారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే సత్తిరెడ్డి సూర్యనారాయణ సారథ్యంలో నిర్వహించగా...సీనియర్ విభాగంలో 13 ఎడ్లబండ్లు, జూనియర్ విభాగంలో 54 ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. సీనియర్ విభాగంలో గండి వెంకటరావు ఎడ్లు 3.2 కిమీ దూరాన్ని 6.54 నిమిషాల్లో చేరుకొని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. విజేతలకు రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ బహుమతులు అందజేశారు.

'డీఎస్పీ'గా విజయ్ సేతుపతి

హైదరాబాద్: టాలీవుడ్‌లోనూ మంచి క్రేజ్ ఉన్న కోలీవుడ్ నటుడు విజయ్ సేతుపతి. కోలీవుడ్‌లో ఆయన్ని 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి అని అభిమానులు పిలుచుకుంటూ ఉంటారు. అయితే.. అప్పుడప్పుడు తమిళ డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈ నటుడు.. 'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లోనూ స్టార్‌గా మారిపోయాడు. ఆ క్రేజ్‌తో తమిళంతోపాటు తెలుగులోనూ వరుస సినిమాలు చేస్తూ దూసుకెళుతున్నాడు. 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి నటించే 46వ చిత్రం టైటిల్‌ని తాజాగా ప్రకటించారు. ఈ నటుడు 2010లో విడుదలైన 'తెన్‌మేర్కు పరువకాట్రు'లో హీరోగా వెండితెరకు పరిచయమయ్యాడు. అనంతరం 'పిజ్జా', 'సూదుకవ్వం', 'నానుం రౌడీదాన్', 'ధర్మదురై', 'విక్రమ్ వేద', '96' వంటి పలు హిట్ చిత్రాల్లో నటించాడు. ఈ నేపథ్యంలో 46వ చిత్రానికి 'డీఎస్పీ'గా టైటిల్‌ను ఖరారు చేయగా.. ఆ చిత్రానికి పొన్‌రామ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇందులో విజయ్ సేతుపతి చాలాకాలం తర్వాత పోలీస్ అధికారిగా నటిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు. విజయ్ సేతుపతి బైకుపై వస్తున్న పోస్టరు విడుదల చేశారు. కాగా.. విజయ్ సేతుపతికి ఉన్న క్రేజ్ కారణంగా ఈ సినిమాని తెలుగులో కూడా విడుదల చేసే అవకాశం ఉంది.

షాక్ ఇచ్చే 'హిడింబ'

హైదరాబాద్: అశ్విన్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'హిడింబ'. అనిల్ కన్నెగంటి దర్శకుడు. శ్రీధర్ గంగపట్నం నిర్మాత. నందితా శ్వేత కథానాయికగా నటించింది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ "ఓ షాకింగ్ పాయింట్‌తో రూపొందిస్తున్న థ్రిల్లర్ ఇది. అశ్విన్ మేకొవర్ ఆశ్చర్యపరుస్తుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. వికాస్ ఒడిసా స్వరాలు, నేపథ్య సంగీతం ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణ" అన్నారు. సిజ్జు, మకరంద్ దేశ్‌పాండే, రాజీవ్ పిళ్లై, సంజయ్ స్వరూప్ తదితరులు నటించారు.

టెస్టులకు వార్నర్ వీడ్కోలు?

న్యూఢిల్లీ: తన ఆటతోనే కాకుండా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌తో సైతం ఫేమస్ అయిన ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నాడు. వచ్చే ఏడాది ఈ ఆటగాడు టెస్టు మ్యాచులకు వీడ్కోలు పలికే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. టెస్టు ఫార్మాట్‌లో తన ఆటపై స్పందించాడు. వన్డే, టీ20లు ఆడేందుకు మాత్రం తాను ఆసక్తి కనబరుస్తున్నట్లుగా తెలిపాడు. తనలో ఆడే సత్తా తగ్గిపోయిందని విమర్శిస్తున్న వారికి కౌంటర్ ఇచ్చాడు. 'బహుశా అన్నింటికన్నా ముందు కాలం చెల్లేది టెస్టు క్రికెట్‌కే. ఈ ఫార్మట్‌లో ఇదే నా చివరి 12 నెలలు కావచ్చు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్, 2024లో టీ20 ప్రపంచకప్ జరగనున్నాయి. టీ20ల్లో ఆడటం నాకు చాలా ఇష్టం. అది అద్భుతమైన గేమ్. 2024 టోర్నీ కోసం ఎదురుచూస్తున్నా. చాలా మంది క్రికెటర్లు వయసు పైబడటంతో ఆటకు వీడ్కోలు పలుకుతారని.. ఇప్పుడు నా వంతు అని కొందరు మాట్లాడుతున్నారు. నా నుంచి అలాంటివి ఆశించేవారు కాస్త జాగ్రత్త. భవిష్యత్తులో క్రికెట్‌పై నాకున్న అవగాహనను ముందు తరాల వారికి అందించాలనుకుంటున్నాను' అని వార్నర్ తెలిపాడు. సొంత గడ్డపై జరిగిన టీ20 ప్రపంచకప్‌లో ఆసీస్ జట్టు అంచనాలు అందుకోలేకపోయిన విషయం తెలిసిందే. ఈ కీలకపోరులో తమ జట్టు ముందుగానే నిష్క్రమించిన నేపథ్యంలో టెస్టులకు గుడ్‌బై చెప్పి వైట్‌బాల్ గేమ్‌పై దృష్టి సారించాలని వార్నర్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. 2011లో అరంగేట్రం చేసిన ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్.. 46.52 సగటు స్ట్రైక్ రేటుతో 96 టెస్టు మ్యాచ్‌ల్లో 7817 పరుగులు చేశాడు. 24 శతకాలు, 34 అర్థ శతకాలను నమోదు చేసిన విషయం తెలిసిందే.

టీ20ల్లో టీమిండియానే నెంబర్‌వన్

దుబాయ్: టీ20 ప్రపంచకప్ 2022లో టీమిండియా సెమీఫైనల్‌కే పరిమితమైనా.. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో మాత్రం తమ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఆదివారం పాకిస్తాన్‌తో జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో గెలుపొంది విశ్వవిజేతగా నిలిచిన విషయం తెలిసిందే. మెగా టోర్నీ ముగిసిన అనంతరం ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌లో 268 రేటింగ్ పాయింట్స్‌తో ఇండియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లండ్ 265 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది.

మూడో స్థానంలో పాకిస్తాన్

రన్నరప్ పాకిస్తాన్ 258 పాయింట్స్‌తో మూడో స్థానంలో ఉండగా.. సౌతాఫ్రికా, సెమీఫైనలిస్ట్ న్యూజిలాండ్ నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఆస్ట్రేలియా, వెస్టిండీస్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ టాప్-10లో కొనసాగుతున్నాయి. అగ్రస్థానంలో ఉన్న టీమిండియా 61 మ్యాచ్‌లు ఆడగా.. రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ 48 మ్యాచ్‌లు మాత్రమే ఆడింది.

తొలి జట్టుగా ఇంగ్లండ్..

ఉత్కంఠగా సాగిన ఫైనల్లో బెన్ స్టోక్స్ అసాధారణ ప్రదర్శనతో విజయాన్నందుకున్న ఇంగ్లండ్.. సంపూర్ణ పరిమిత ఓవర్ల క్రికెట్ విశ్వవిజేతగా నిలిచింది. 2019లో వన్డే ట్రోఫీని గెలుచుకున్న ఆ జట్టు.. ఏకకాలంలో రెండు ఫార్మాట్లలో ట్రోఫీ కలిగి ఉన్న తొలి జట్టుగా ఘనత సాధించింది. అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఇంగ్లండ్ జట్టు రెండోసారి టీ20 ప్రపంచకప్‌ను చేజిక్కించుకుంది. 1992 వన్డే ప్రపంచకప్ ఫైనల్లోలాగే ఆ జట్టును ఓడించి కప్పును గెలుచుకోవాలనుకున్న పాకిస్తాన్ కల చెదిరింది.

ఐసీసీ బెస్ట్ ఎలెవన్

పురుషుల టీ20 ప్రపంచకప్ 2022లో అత్యంత విలువైన ఆటగాళ్లతో కూడిన టీమ్‌ను ఐసీసీ తాజాగా ప్రకటించింది. టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, సూర్యకుమార్ ఈ జాబితాలో స్థానం దక్కించుకున్నారు. తాజా టోర్నీలో 98.66 సగటుతో 296 పరుగులు చేసిన కింగ్ కోహ్లి ఈ జాబితాలో ముందు వరసలో నిలిచాడు. పాక్‌పై అద్భుతంగా ఇన్నింగ్స్ ఆడిన విరాట్ కోహ్లి (82 నాటౌట్) ఒంటిచేత్తో జట్టును గెలిపించిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌పై 64, నెదర్లాండ్స్ మీద 62, ఇంగ్లండ్‌తో 50 పరుగులు చేసి టీ20 ప్రపంచకప్‌లో విరాట్ అత్యుత్తమ బ్యాటర్‌గా నిలిచాడు. ఈ టోర్నీలో 239 పరుగులతో అదరగొట్టిన సూర్యకుమార్ కూడా చోటు దక్కించుకున్నాడు. నెదర్లాండ్స్‌తో 51, దక్షిణాఫ్రికాతో 68, జింబాబ్వేతో 61 పరుగులు చేసి మూడు అర్థ సెంచరీలను తన ఖాతాలో వేసుకున్న ఈ ఆటగాడు అద్భుతమైన స్ట్రైక్‌రేట్(189.68)ను ప్రదర్శించాడు. హార్దిక్ పాండ్యా 12వ ఆటగాడిగా ఎంపికయ్యాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.